POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
ఫిబ్రవరి 2023
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 40 సంచిక: 10



సద్గురు శ్రీ ఎక్కిరాల భరద్వాజుల బ్రహ్మానుభూతి పర్వదినం (9-2-2023) సందర్భంగా సాయిబాబా పత్రిక పాఠకులకు, భక్త మహాశయులకు, సమస్త మానవాళికి గురుదేవుల ఆశీస్సులు లభించాలని ప్రార్థన!



## శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానములో పరమ పూజ్య భరద్వాజ గురుదేవుల బ్రహ్మానుభూతి పర్వదిన విశేష కార్యక్రమములు, ఫిబ్రవరి 9 - 2023

### ఉదయ కార్యక్రమములు

గం 5.30 - మేలుకొలుపు

గం 6.00 - కాకడ ఆరతి

గం 7.30 - అభిషేకము, ప్రత్యేక అలంకరణ

గం 8.30 - అల్పాహార నైవేద్యము తదనంతరము అల్పాహార ప్రసాద వితరణ

గం 10.00 - ప్రత్యేక పూజ

గం 11.00 - శ్రీమతి అడిదం వేదవతి గారిచే సత్సంగము

గం 12.00 - మధ్యాహ్న ఆరతి

గం 12.30 - మధ్యాహ్న భోజన నివేదన, తదనంతరము ప్రసాద వితరణ

### సాయంకాల కార్యక్రమములు

గం 4.00 - ధుని పూజ (గోత్రనామాలతో సద్గురు స్వరూపమైన ధునికి)

గం 6.00 - సాయంకాల ఆరతి

గం 6.30 - పారాయణ

గం 8.00 - రాత్రి భోజన నివేదన, తదనంతరం ప్రసాద వితరణ

గం 9.00 - శేజ్ ఆరతి

గం 9.30 - పవళింపు సేవ

*సూచన: ఒంగోలు నుంచి సన్నిధి కి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉదయం 8.30 గంటలకు మంగమూరు డొంక సాయిబాబా దేవాలయం నుంచి బస్సు బయలుదేరును. ఈ బస్సు సాయంత్రం 6.30 గంటలకు సన్నిధి నుండి తిరిగి ఒంగోలుకు బయల్దేరుతుంది.*

# ఆస్తి-నాస్తి

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

***నువ్వింతగా ఆస్తికత్వం గురించి చెబుతున్నావు గాని ఎందరో మేధావులు మహిమలనేవి లేనేలేవని నిరూపిస్తున్నారు కదా! ఇటీవల నిప్పు మీద నడిచి చూపించారు. అలానే కరచాలనంతో విభూతిని సృష్టించడం కూడా గారడివిద్యే గాని మహిమ కాదంటున్నారు. మరి నువ్వేమంటావ్?***

"అసలైన ఆస్తికత్వానికి ఆధ్యాత్మికతకు యిలాంటి అద్భుతాలతో ప్రమేయము లేనేలేదు. ఉదాహరణకు హిందూమతంలో ఆధ్యాత్మికతకు ప్రమాణగ్రంథాలుగా చెప్పబడిన ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీతలలో వాటి ప్రస్తావనేలేదు. ఇలాంటి శక్తుల వలన ఆధ్యాత్మికతను నిరూపించవచ్చని చెప్పబడలేదు. ఆధ్యాత్మికత దుఃఖం నుండి, అజ్ఞానం నుండి విముక్తికి మార్గం మాత్రమేనని చెబుతాయి. అలానే బుద్ధుడు కూడా మానవజీవితంలోని దుఃఖం గురించి ఆలోచించి, దాని నుండి విముక్తికి మార్గం మాత్రమే బోధించాడు. ప్రాచీన చైనాకు చెందిన తావో మతం కూడా అలానే చెబుతుంది. కనుక మహిమలను విమర్శించే వారంతా ఆధ్యాత్మికతకు సంబంధంలేని అంశాలనే విమర్శిస్తున్నారన్నమాట. ఆధ్యాత్మికత గురించి ప్రజలలో ప్రబలిన దురభిప్రాయాన్ని మాత్రమే వీరు విమర్శిస్తున్నారన్నమాట.

ఇది సరిగ్గా తెలియాలంటే ఆధ్యాత్మికత ఏమి చెబుతుందో స్పష్టంగా తెలియాలి. సర్వగతము, నామరూప రహితము అయిన ఒకానొకశక్తి మనకిప్పుడు గోచరించే వివిధ వస్తువులకు ఆధారమని క్షేత్ర భౌతిక సిద్ధాంతము (Field Theory in Physics) చెప్పినట్లే ఆధ్యాత్మికత కూడా చెబుతుంది కాకుంటే ఆ శక్తి సచేతనమని, అదే దైవము లేక పరమాత్మ అని ఆధ్యాత్మికత చెబుతుంది. భౌతికశాస్త్రం ఆ మాట చెప్పదు. ఎంత ఆలోచించినా ఆస్తికత, నాస్తికతలకు యిదే భేదం. ఆ శక్తి సచేతనమయితే ఆధ్యాత్మికత నిరూపించబడ్డట్లే.

జడానికి సచేతనానికి ప్రధానమైన భేదమొక్కటే. సచేతనం తనలో తాను మార్పు తెచ్చుకోగలదు. ఉదాహరణకు మనిషి స్వేచ్ఛగా పని చేయగలడు. కానీ జడం బాహ్యప్రభావం లేక తనలో తాను ఎట్టి మార్పు చేసుకొనలేదు. ఇప్పుడు సృష్టి ఆదిలో ఒకటిగా ఉన్న శక్తి ఎలక్ట్రాన్ వంటి సూక్ష్మకణాలు, వాటి సముదాయములైన అణుపరమాణువులుగాను దేని ప్రభావం చేత మారినట్లు? దానిని ప్రభావితము చేయడానికి వేరొక వస్తువేది ఏర్పడక ముందు దశ గురించి కదా మనము మాట్లాడుతున్నది. కనుక అది తనలో తానే అట్టి మార్పు చేసుకొని వుండాలి. అంటే అది సచేతనమైవుండాలి.

అంతేకాక సచేతనము తనలో తాను చేసుకునే మార్పులు క్రమబద్ధంగా కూడా ఉంటాయి ఈ సృష్టి అంతా క్రమబద్ధమే ననడానికి ఆధారం నేడు రూపొందుతున్న విజ్ఞాన శాస్త్రాలే (Sciences). వివిధ శాస్త్రాలు సృష్టి యొక్క

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:40 ఫిబ్రవరి-2023 సంచిక:10

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | ఆస్తి-నాస్తి | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | సద్గురు మహిమ | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 07 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి కనకదుర్గ | 11 |
| 05. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 13 |
| 06. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 16 |
| 07. | పరసువేది | శ్రీ ఎమ్. సీతారామయ్య | 20 |
| 08. | మరికొందరు భక్తులు | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 23 |
| 09. | ద్వారకామాయి  అనుభవమండపము | తీగల శ్రీకాంత్ | 25 |
| 10. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి సుభాషిణి | 27 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |


సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

వివిధ అంశాలను పరిశీలించి వాటికి మౌలికము, క్రమబద్ధము అయిన ప్రకృతి సూత్రాలను నిర్వచిస్తాయి. అంటే ప్రకృతిలోని ఆయా అంశాలు అలా క్రమబద్ధంగా ప్రవర్తిస్తాయన్నమాట! సృష్టికి మూలమైన శక్తి సచేతనం అనడానికి యిదొక నిరూపణ.

అయితే ఆ శక్తిచేత చేయబడిన వాటిలో కొన్ని వస్తువులు జడంగాను, కొన్ని సచేతనంగాను ఎందుకుంటాయి? - అన్నది ప్రశ్న. సృష్టికి మూలమైన శక్తి విద్యుదయస్కాంత ధర్మాలు గల ధార్మికశక్తి లేక క్షేత్రము అని నేటిభౌతిక శాస్త్రం చెబుతోంది. కానీ దానియొక్క కూర్పులలో చెక్కవంటి పదార్థాలు విద్యుదయస్కాంత ధర్మాలను ప్రకటించకపోవడం వంటిదే సచేతనమైన శక్తి యొక్క రూపాలలో కొన్ని అచేతనంగా గోచరించడానికి కారణం.

ఆత్మ లేక దైవము అనబడే చైతన్యమే వాస్తవముకాదని నాస్తిక వాదానికి అర్థము. కానీ అలా వాదించాలంటే వాదించే వారికి చైతన్యముండాలి కదా! వాడి వాదమే నిజమైతే వాడు రాయివలె జడుడై వాదించటానికి అతడంటూ ఒకడు వుండకూడదు. వాడితో వాదించే ఆస్తికుడూ వుండకూడదు. అంతేకాదు ధర్మము-అధర్మము, ప్రేమ-ద్వేషం, జ్ఞానము-అజ్ఞానము అనేవి చైతన్యానికే సాధ్యం కానీ జడానికి కాదు. అప్పుడు చైతన్యమే లేదని వాదించేవారు సమాజాన్ని మూఢనమ్మకాల నుండి కాపాడాలని తలచడమేమిటి? చైతన్యమే లేనప్పుడు చుట్టూ జగత్ అనేది ఒకటి ఉందని గుర్తించడం ఎలా సాధ్యం? చైతన్యమే వాస్తవం కాకుంటే దాన్ని అనుభూతి మాత్రమే అయిన ఈ జగత్తుగాని, దానిని గూర్చిన పరిశోధనగాని, తత్ఫలితంగా రూపొందించబడిన ఆస్తి-నాస్తి వాదాలు కానీ ఎలా వాస్తవం కాగలవు? కనుక ఏ రీతిగా చూసినా చైతన్యం లేదనడానికి వీలులేదు. ఇది సృష్టికి మూలమైన తత్త్వానికి గల ధర్మమని(సత్-చిత్) ఆధ్యాత్మిక గ్రంథాలన్నీ చెబుతున్నాయి. అన్నింటి లోనూ వున్న ఆ 'శక్తి-చేతనమే' పరమాత్మ, లేక దైవమని అది మనలోని నేనుగా అనుభవము అయినప్పుడు 'జీవాత్మ' అని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతాయి. వీటిని అసత్యమని నిరూపించగల వాదమే వుండజాలదు.

సృష్టికి మూలమైన శక్తి నశించేది కాదు కనుక, ఎన్ని రూపాలు ధరించినా దాని మూలతత్వంలో ఎట్టి మార్పు వుండదు. కనుక దానిని సత్ (Real) అన్నారు. సచేతనము కనుక దానిని చిత్ (Awareness) అన్నారు. అది ఆనందమని కూడా అన్నారు. మానవుడు ఎన్ని సాధించినా యింకా ఏమో పొందాలన్న కోరిక అతనిని దహిస్తూనే వుంటుంది. అట్టి కొరతనుండి దానిని ఆధారం చేసుకొని వుత్పన్నమయ్యే భయ, అసూయ, ద్వేషాది కలతలులేని స్థితినే ఆనందమన్నారు. సృష్టికి ఆధారమైన శక్తి దృష్టిలో అన్యమన్నది లేదు. కనుక అది దేనిపట్ల ఇట్టి భావాలను పొందజాలదు. కనుక అది ఆనందము. అంతగా వికసించని మన చైతన్యము మూలశక్తి యొక్క రూపము మాత్రమే అయిన దేహమే తానని భ్రమించి తత్కారణంగా అన్యంగా తోచే జగత్తుపట్ల పైన చెప్పిన కలతలను చెందడమే అజ్ఞానము--తాను అట్టి దేహమనే రూపము మాత్రమే కాదని సృష్టికి మూలమైన తత్త్వానికి భిన్నముగా తానులేడని అనుభవపూర్వకంగా గుర్తించడమే ఆధ్యాత్మకత, లేక ఆత్మజ్ఞానము, లేక భగవదైక్యమని ఆధ్యాత్మికత చెబుతుంది.

ఇలా అంటే ఆధ్యాత్మిక శక్తులే అసత్యమని తలచరాదు. ఇప్పుడు మనకు అనుభవమయ్యే మూడు నిరూపకాలతో కూడిన ఆకాశము (space) భూతభవిష్యద్వర్తమానాలుగా గుర్తించబడే కాలం వాస్తవంకాదని, యివి రెండూ కలిసి దేశకాలము నాలుగు నిరూపకాలతో కూడినదే సత్యమని ఐన్-స్టీన్ నిర్వచించిన సాపేక్ష సిద్ధాంతం చెబుతుంది ఇప్పటి మన చైతన్యం అజ్ఞానంచేత మూడు నిరూపకాలతో కూడిన ఆకాశమే వాస్తవమని కాలం దానికి భిన్నమని తలుస్తుందని అర్థము. మన చైతన్యమట్టి అజ్ఞానాన్ని అతిక్రమించినప్పుడు సృష్టి అంతటా ఎప్పుడు, ఎక్కడ, ఏమి జరుగుతున్నా తెలుసుకొనగలగాలి. అట్టి స్థితిని పొందినవారు చాలా కొద్దిమంది మాత్రమే వుంటారని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతాయి. కనుక త్రికాలజ్ఞత, సర్వజ్ఞత అనే అద్భుతశక్తులు శాస్త్రవిరుద్ధమనడానికి వీలులేదు. ఐన్ స్టీన్ కనుగొనక ముందు అంత మేధావి పుట్టలేదని అతడు నిర్వచించిన ప్రకృతి ధర్మము అంతకుముందు లేదని చెప్పలేము కదా! అలానే అంతటి మహిమ చూపేవారు మనకి తారసిల్లనంతమాత్రాన అట్టి సామర్థ్యమే అసత్యమనడం శాస్త్ర విరుద్ధము. సమాజములో మనకు కనిపించే వ్యక్తులలో ఎక్కువమంది పరీక్షలలో కాపీకొట్టారన్నంతమాత్రాన విద్య అనేది లేదనడం సమంజసం కాదు. అలానే నేడు నాస్తికులకు, హేతువాదులకు మహిమలున్నాయని నిరూపించగలవారు

***మిగతా 10వ పేజీలో***

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

## *ప్రశ్న :- శిరిడీ సాయిబాబా అన్ని ఫోటోల్లోనూ తలపాగా (కఫ్నీ) ధరించియే యున్నారు. కారణం తెలుసుకోవచ్చా?*

**- ఇ. గోపాలకృష్ణమూర్తి, ఒంగోలు**

**జవాబు :-** బాబా తాము తలపాగాను ధరించిన కారణం ఎప్పుడూ ఎవ్వరికీ చెప్పలేదు. ఇస్లాంలో తలపై గుడ్డ వుంచుకొనడం శరణాగతికి చిహ్నం. అందుకే నమాజు చేసేటప్పుడు తలపై వస్త్రం వేసుకుంటారు. 'అల్లామాలిక్ హై' అంటూ బాబా తాము భగవంతునికి నిత్య శరణాగతుడనని స్పష్టపరిచేవారని, ఎన్నడూ తీయని ఆయన 'తలగుడ్డ'ను బట్టి మనం భావించవచ్చు. ఇంకా యోగపరమైన, చమత్కార భూయిష్టమైన కారణాలు కొందరు చూపారు గానీ అవేవీ శాస్త్రానికి, పరిప్రశ్నకు నిలబడవు. పోతే మీ ప్రశ్న సూచిస్తున్నట్లు 'కఫ్నీ' అంటే తలగుడ్డ కాదు. బాబా ధరించిన పొడవైన అంగీ (చొక్కా). ●

---

## *ప్రశ్న :-1) బాబాకు అసలు భిక్ష తెచ్చుకుని తినవలసిన పని ఏముంది? ఆయన దేముడుకదా? 2) సాయిబాబా మసీదులో వుంటారుకదా మహమ్మదీయులు బాబాను పూజించరు ఎందుకని?*

**- ఎన్. రాజమ్మ, పుల్లంపేట**

**జవాబు :-** 1) శ్రీసాయి హిందూ ముస్లిమ్ సాంప్రదాయాలను మేళవించి పాటించే సూఫీ సాంప్రదాయంలోని ఫకీరు. మహారాష్ట్ర దేశములో గోసాయిలను, 'సాఁయ్' అని పిలిచేవారు. దానికి బాబా పలికారు. సాయి నైష్టిక బ్రహ్మచారి, ఫకీరు. ఆ ధర్మాన్ని అనుసరించి ఆయన భిక్ష చేసారు.

*అన్నరగ్ని రనికేతస్స్యా గ్రామ మన్నార్థ మాశ్రయేత్ I*
*ఉపేక్షకో సంకుసుకో మునిర్భావ సమాహిత I*
*కపాలం వృక్షమూలాని కుచేల మసహాయతా I*
*సమతాచైవ సర్వస్మిన్నేన్ముక్తస్య లక్షణం II*

లౌకి కాగ్ని లేనివాడై, యిల్లులేక, తన శరీరముపట్ల, విషయాల పట్ల ఉపేక్ష గలవాడై ఆహారము కొఱకు మాత్రమే గ్రామములోనికి పోవుచూ ఎప్పుడు మౌనియై బ్రహ్మధ్యానమునందు తన్మయుడై యుండవలెను. భిక్షకై మట్టి మూకుడును, నివాసమునకు చెట్ల మూలమును, చింకి బొంతలు దుస్తులుగను, అన్నింటియందు సమత్వ బుద్ధియు యివి ముక్తుడయిన యతికుండవలసిన లక్షణములు. వారు సాధు, ఫకీరు ధర్మములో అవతరించారు గనక ఆ ధర్మము ప్రకారము భిక్షాటన చేశారు. *"గ్రామమన్నార్థ మాశ్రయేత్"* భిక్షకొరకు మాత్రమే శిరిడీ గ్రామంలోకి వెళ్ళారు. ఐదు యిళ్ళవద్ద మాత్రమే భిక్ష చేసేవారు.

**మిగతా 15వ పేజీలో**

(జూలై 2012 సాయిబాబా మాసపత్రిక నుండి)

# సద్గురు మహిమ

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

సద్గురు మహిమగూర్చి వర్ణించనెవరితరమూ గాదని పెద్దలు చెబుతారు. అంటే గురు మహిమ మన ఊహకు అందనంతటి గొప్పది అని అర్థం.

అసలు 'గొప్పది' అంటే ఏమిటి? కరుణ వర్షించడంలోనా? కఠినంగా శిక్షించడంలోనా? మామూలుగా మనం గురుమహిమ గూర్చి చెప్పుకునేటప్పుడు కరుణ వర్షించడంలోనేనని అనుకుంటాము.

'గురుమహిమ' అంటే గురువు యొక్క చర్యలు అంతటి మహిమ గలవి అని అర్థం. సద్గురువు సకల చరాచర సృష్టినీ సృష్టించి, నిలిపి, లయమొనరుస్తాడు. అందుకని ఈ సృష్టి మొత్తం ఆయన మహిమా స్వరూపమే. ఒక కవి హృదయం పులకించినా, ఒక గాయకుని హృదయం పరవశించినా, ఒక తాత్వికుని హృదయం చింతన చేసినా, ఎందరు ఋషులు, మునులు, యోగులు తమ తపస్సుల ద్వారా ధ్యానించినా, ఎందరు వైజ్ఞానికులు పరిశోధనలు జరిపినా - వారు తెలుసుకునేది ఆయన మహిమాన్విత సృష్టిలో అణువంతమాత్రమే.

అలాగే స్థితి, లయములుగూడ ఆయన యొక్క మహిమా స్వరూపమే.

గురు మహిమ అతి చిత్రమైనది. పసి పిల్లవాడికి తాయిలం పెట్టినట్లు మనకు తాయిలాలుగా చిన్న చిన్న కోరికలు వెంటనే తీర్చి మనలను మురిపిస్తుంది. కొద్దిగా ఎదిగాక ఒక చెంపను ముద్దు పెట్టుకుంటూ మరొక చెంపను పగులకొడుతున్నట్లు కొన్ని కోరికలు తీరుస్తూ, కొన్నింటిని తీర్చక ఏడిపిస్తూ వుంటుంది. ఒక చెంప వాయిస్తున్నట్లు కొన్ని కష్టాలను తీర్చక, నేను లేననుకోవడానికి వీలులేనట్లు కొన్ని కోరికలు తీరుస్తూ, కాసేపు ఏడిపిస్తూ, కాసేపు నవ్విస్తూ తను తప్ప గతిలేనట్లు ప్రవర్తిస్తుంది. సాధనలో ఎదిగిన వాడికి అంటే యింకా బాగా తనను నమ్ముకున్నవాడికి వట్టి చెంపదెబ్బలు మాత్రమే గాదు, కొరడా ఝుళిపించడం గూడ చేస్తుంది. ముద్దులు, మిఠాయిలు ఏ మాత్రం వుండవు.

సద్గురువు మహిమ వెన్న వలె అతి మృదువైనది. అంతేగాదు, వజ్రం వలె అతి కఠినమైనది గూడ. అయితే ఎవరెవరి స్థాయిని బట్టి వారి వారి పట్ల అట్లా ప్రవర్తించడము, ప్రసాదించడము చేస్తుంది. అయితే ఎంత కఠినంగా వుంటుందో అంత శ్రేయస్సును చేకూరుస్తుంది.

అంతటి మహిమ గల సద్గురువు చేసిన కొన్ని లీలలను యిప్పుడు చెప్పుకుందాము.

సద్గురుని లీలలు చిత్రవిచిత్రములుగా వుంటాయి. ఆయన ఒక నిరుపేదవాడిని గొప్ప ధనవంతుడుగా చేస్తాడు. మరొకనిని నిష్ఠదరిద్రునిగా చేసి చూస్తూ వూరుకుంటాడు. ఒకరికి ప్రాణం పోస్తే, మరొకరిని(మన దృష్టిలో) నిర్దాక్షిణ్యంగా ప్రాణం తీస్తాడు.

చాకలివానికి సామ్రాజ్యమిస్తాడు. మూగవానిని వేదవేదాంగ పారంగతుని చేస్తాడు. గొడ్రాలికి సంతానం ప్రసాదిస్తాడు. ఇలా ఎందరికో ఎన్నో కోరికలు తీరుస్తాడు.

అయితే గురు మహిమకు మరోకోణం గూడ వున్నది. అది రెండువైపులా పదునువున్న కత్తిలాగా పనిచేస్తుంది.



గురువు ఒక ప్రక్క మధురమైన పండ్ల ముక్కలు కోసి పెట్టినట్లు మధురానుభవాలను ప్రసాదిస్తూనే మరొకవంక ఆపరేషన్ చేసినట్లు కష్టాలను గూడా ప్రసాదిస్తాడు. అయితే వైద్యుడు మన శరీరానికి పనికి రాని, హాని కలిగించేవాటిని తొలగించడానికి, సవరించడానికి ఆపరేషన్ చేసినట్లే సద్గురువు గూడ కష్టాలను అనుభవించేటట్లు చేసి, వెనుక తానుండి శ్రేయస్సును చేకూరుస్తాడు. వైద్యుడు మనకు ఆరోగ్యాన్ని ప్రసాదించినట్లే సద్గురువు పరమార్థాన్ని ప్రసాదిస్తాడు.

సమర్థ సద్గురువైన శ్రీ శిరిడీ సాయిబాబా పూజ్యశ్రీ మాస్టరుగారిని ప్రథమ దర్శనంలోనే అంతగా అనుగ్రహించి ఆయన ద్వారా తాము చేయదలుచుకున్న లోకకల్యాణ కార్యక్రమాన్ని చేయించుకుంటున్నప్పటికీ, మరొకవైపు లౌకిక జీవితంలో ఆయనకు అనేక ఒడిదుడుకులను ప్రసాదించారు. నల్లేరు మీద నడకగాకుండా పల్లేరు కాయల మీద నడకగా సాగింది ఆయన జీవితం. అన్ని వైపులనుంచీ ఆయనకు ఎదురుగాలులే వీచాయి. తమను అడిగినవారికి, అడగనివారికీ గూడ వారి అవసరాలు గుర్తించి ఆర్థిక సహాయం అందించిన ఆయన ఆర్థికంగా ఎంతో యిబ్బంది పడవలసి వచ్చింది. సరియైన ఆధ్యాత్మికతను బోధించినందుకుగాను ఆధ్యాత్మికత అంటే సరిగా తెలియని వారందరి యొక్క ఎదురుదాడులను ఎదుర్కోవలసి వచ్చింది. ఇలా సత్యాన్ని బోధించిన ప్రతి విషయంలోనూ ఎదురుదాడులను ఎదుర్కొంటూ, ఎదురు బాటలోని ముళ్ళను ఏరివేసుకుంటూ ముందుకు సాగిపోయారాయన.

అయితే ఆయనను నమ్ముకుంటే కష్టాలను ఎదుర్కోవలసిందేనా? అన్నది ప్రశ్న. కానీ ఆయనను నమ్ముకోకపోతే కష్టాలను తొలగించుకోగలమా? అన్నది ఎదురు ప్రశ్న. అసలు తమను నమ్ముకున్నవారిని కష్టాలపాలు చేస్తారనడం లోకంలో పరిపాటి. అయితే వారిని నమ్ముకోవడమెందుకు? అందుకనే, “అంతగా వారిని నమ్ముకోకుండా కష్టాలు వచ్చినప్పుడు మాత్రమే వారిని ఆశ్రయిస్తే వాటిని వారు తొలగిస్తారు, లేకపోతే లేదు. అంతమాత్రం భక్తి మనకు చాలు, అంతకుమించి మనకు వద్దు, అవసరంలేదు గూడ. కారణం ఎంత ఎక్కువగా భక్తి వుంటే అంతగా కష్టాలు పడవలసి వస్తుంది” అని చాలా

మంది పరిమితమైన భక్తితో సద్గురువులను ఆశ్రయిస్తూ వుంటారు.

అయితే నిజంగా సద్గురువు అలా ఎందుకు చేస్తాడు? దానిలో వున్న అంతరార్థమేమిటి? అంతగా కష్టాలు పెట్టినా భక్తులు వారిని వదులుకోకపోవడానికి కారణమేమిటి?

సద్గురుభక్తివలన తలకుమించిన కష్టాలు రాక తప్పవా?

జీవితంలో కష్టసుఖాలు రెండూ అనుభవించడం అన్ని జీవులకూ సమానమే. కానీ మానవుడు మాత్రం ఈ రెంటినీ పోల్చి చూచుకుని కష్టాలలోంచి బయటపడే ప్రయత్నం చేస్తాడు. అంటే మానవుని అభివృద్ధికి కష్టాలు ఒక కారణమని చెప్పవచ్చు. అట్టి కష్టాలే లేకుంటే మానవుడు అభివృద్ధి చెందటానికి కావలసిన ప్రయత్నం చేయడు. అంటే ఇటు లౌకికంగానూ, అటు పారమార్థికంగానూ కూడా జడుడుగా, స్తబ్ధుడుగా మిగిలి పోతాడు.

అంతేకాదు. శక్తికి మించి సద్గురువెన్నడూ ఆధ్యాత్మికతలోకి లాగజూడడని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పేవారు. అంటే భక్తునికి వివేక వైరాగ్యాలు కలుగజేయడానికి, కర్మక్షాళన చేయడానికి అవసరమైన కష్టాలు ప్రసాదిస్తాడు సద్గురువు. అలా కాక పూర్వకర్మ వలన భరించలేనంతటి కష్టాలు వచ్చినపుడు తోడుండి రక్షిస్తాడు. అవసరమైతే అట్టి కర్మను తొలగిస్తాడు కూడా.

మనసుకు వివేకాన్ని, వైరాగ్యాన్ని, ధర్మంగా నడవడానికి కావలసిన మానసిక ధారుడ్యాన్ని, సాధనకు కావలసిన పట్టుదలను క్రమంగా మనకు కష్టాలు అలవరుస్తుంటాయి. అలానే జీవితానికి కావలసిన స్ఫూర్తిని, ఉత్సాహాన్ని సుఖాలు, సంతోషాలు మనకు కలిగిస్తాయి. సద్గురువు తన భక్తునికి క్రమపద్ధతిన, తగురీతిన ఆ భక్తుని కర్మశేషాన్ని అనుసరించి, యిట్టివి ప్రసాదిస్తాడు.

ఈ విషయం సద్భక్తునికి మరువలేని సత్యంగా నిలుస్తుంది కనుక కష్టాలకు బెదరక, తన గురువు రక్షణను గుర్తుంచుకుని ధైర్యంతో, ఓర్పుతో, పట్టుదలతో వాటిని ఎదుర్కొంటాడు. తన కర్మ క్షాళనమవుతున్నందుకు సంతోషిస్తాడు. నేర్వవలసిన పాఠాలను నేర్చుకుంటాడు. తన జీవితంలోని కష్టసుఖాలు అన్నీ ఆ సద్గురు మహిమే అని గుర్తుంచుకుని పులకరిస్తుంటాడు. కష్టాలకు కృంగక, సుఖాలకు పొంగక సమత్వాన్ని సాధిస్తాడు.

కష్టాలు భక్తులకు, భక్తులు కానివారికీ గూడ వస్తాయి. అయితే వారు అనుభవించే తీరులోనే తేడా వుంటుంది. భక్తులు వాటిని అంతగా పట్టించుకోరు. జీవితంలో కష్టసుఖాలు వస్తుంటాయి పోతుంటాయి, అవి సహజమేనని భావిస్తారు. చేయవలసినది భగవంతుని స్మరణ, శరణాగతి మాత్రమేనని, ఆయనకు నచ్చినట్లు కర్తవ్యాన్ని నిర్వర్తించడమేననీ తలుస్తారు. లేక అవి సద్గురువు తమకు పెట్టే పరీక్షలని తలుస్తారు. లేక వాటిని ప్రసాదాలని గూడ తలచవచ్చు. అందుకే వాటికి వారు కృంగరు. శాంతితో వుంటారు.

భక్తులు గాని వారు, అంటే సామాన్యులు, కష్టాలు వచ్చినప్పుడు బాధపడుతూ వాటికి కారణమైన పరిస్థితులను, వ్యక్తులను తిట్టుకుంటూ, ఇతరులకు, తమకూ అశాంతిని కలుగజేసుకుంటారు. ఇటువంటి భావాలవలన అవి యింకా యింకా పెరిగి సంస్కారాలు బలపడి నిరంతరం అశాంతిపూర్వకమైన ఆలోచనలలో సతమతమవుతుంటారు.

ఉదాహరణకు ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య పరిస్థితులు, చదువు, ఉద్యోగ సమస్యలు మాత్రమే గాక ఉదయం లేచింది మొదలు వారిట్లా వున్నారనో, వీరిట్లా అన్నారనో, లేక వారిట్లా చేసారనో అనుకుంటూ శాంతిని కోల్పోతుంటారు. ఇవి మాత్రమేగాక హోదా, అంతస్థు, పరువుప్రతిష్ఠలు, మర్యాదలు – వీటన్నిటినీ ఆధారం చేసుకుని వాటిని నిలుపుకోవడానికి శతవిధాలుగా ప్రయత్నించడంలో అశాంతిని కొనితెచ్చుకుంటారు. అతి చిన్న విషయాలు గూడ అతి పెద్ద విషయాలుగా వాళ్లను బాధపెడుతుంటాయి. ఉదాహరణకు ఒకరు తమను పలుకరించలేదనో, నమస్కరించలేదనో, కూర్చోమనలేదనో, తినడానికీ, త్రాగడానికి ఏమీ అడుగలేదనో ఇలాంటి వాటిని భూతద్దంలోనుంచి చూస్తూ శాంతిని కోల్పోతారు. జీవితాంతము వాటిని తలచుకుని వాపోతుంటారు గూడ.

కానీ నిజమైన భక్తులకు యివేవీ పట్టవు. పట్టకూడదు గూడ. వారు ఇటువంటి వాటిని చాలా అల్పవిషయాలుగా తలుస్తారు. వారు మర్యాదల కోసము, పొగడ్తల కోసమూ వెంపర్లాడరు. ఇవన్నీ వున్నా లేకపోయినా ఒకటిగానే భావిస్తారు. వాళ్ళకసలవి పట్టవు గూడ. అలాగని వాళ్ళు తమ కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేయరు. నిస్వార్థంగా, తమ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తిస్తారు.

నిజమైన భక్తులు ఎల్లప్పుడూ తృప్తితో వుంటారు. వారు పస్తులుండవలసి వచ్చినా బాధపడరు. దీనికి ఉదాహరణ

బాబా చరిత్రలోని మహల్సాపతి, శ్రీ గురుచరిత్రలోని యాయవారవృత్తిలో జీవించే నిరుపేద బ్రాహ్మణుడు. అలాగే సాఠేకు శిరిడీ గ్రామంలో వచ్చిన వ్యతిరేకత వల్ల బాబాను దర్శించడానికి వీలుపడక పోయినా అతడు బాధపడలేదు. బాబా తన శ్రేయస్సుకే అలా చేసారని భావించి తాను వున్నచోటనే బాబా సేవ చేసుకున్నాడు. అలాగే దీపకుడు మొ॥న శిష్యులను గురువు ఎలా బాధలు పెట్టారో గురుచరిత్రలో చూడవచ్చు.

అంటే నిజంగా సద్గురువును విడువక ఆశ్రయిస్తే, మనకు కనిపించే కష్టాలు వాళ్ళకు కష్టాలుగా అనిపించవన్నమాట. అంటే ఆయన ప్రసాదించే శాంతి ముందు యివి అత్యల్పాలన్నమాట. ఎంతవున్నా యింకా లేదనే కొరత, ఎన్నిసార్లు మనకిష్టమైనవి తిన్నా యింకా యింకా తినాలనే కోరిక, ఎంతగా సుఖాలను అనుభవిస్తున్నా యింకా యింకా అనుభవించాలన్న తపన – ఇవేవీ వారికి వుండవన్నమాట.

అంటే మనకు ఎంతో యిష్టమైన పదార్థం కడుపునిండా తిన్నప్పుడు కలిగే తాత్కాలికమైన తృప్తి, మనం కోరుకున్న సుఖాలను అనుభవిస్తున్నప్పుడు వుండే తాత్కాలిక సంతోషము; వారికి ఎప్పుడూ వుంటాయన్నమాట! ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రపంచంలోని మానవజాతి అంతా దేనికోసమైతే ప్రాకులాడుతూ దానిని పొందలేకపోతున్నదో అట్టిదానిని భక్తునికి ప్రసాదిస్తాడు సద్గురువు. అట్టి అపారమైన, అంతులేని తృప్తి శాంతులను ప్రసాదిస్తాడు గనుకనే సద్గురువును సద్భక్తులు విడువరు, విడువలేరు గూడ.

అంతేగాదు,అట్టిసద్భక్తునిసద్గురువుతనంతటివానిగా గూడా చేస్తాడు. అట్టి వారిని ఆశ్రయించి మరెందరో ఐహిక, ఆముష్మిక సుఖాలను పొందుతారు. ఇక్కడ విచిత్రమేమిటంటే అట్టివారినే మనము గూడ కోరికలు తీర్చుకోవడానికి ఆశ్రయిస్తాము. మరి ఆయన అంతగా కష్టాలనే ప్రసాదించేవాడే అయితే అట్లా అనుభవించేవారినే మనము ఎందుకు ఆశ్రయిస్తున్నాము? వాళ్ళ దగ్గర శాంతి సౌఖ్యాలను ఎందుకు పొందగలుగుతున్నాము? మన కోరికలను ఎలా తీర్చుకోగలుగుతున్నాము?

ఇందుకు ఉదాహరణ పూజ్యశ్రీ మాస్టరుగారు. ఆయనకు ఆత్మానుభూతిని ప్రసాదించి తనంతటివారుగా చేసారు బాబా. తద్వారా కొన్ని కోట్లమందికి ఈనాడు శ్రేయస్సు చేకూరుస్తున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు అనేక విధాలుగా చేసిన సద్గురు సాయి తత్త్వ ప్రచారం వలన కొందరు చిన్న పెద్ద కోరికలు తీర్చుకుంటుంటే, కొందరు ఇహపర శ్రేయస్సును పొందుతున్నారు. కొందరు పరమైన తత్త్వాన్నే పొందుతున్నారు. అట్టి అద్భుతమైనది గురుమహిమ.

నిజంగానే అట్టి గురుమహిమను కొనియాడడం ఎవరి తరము? ఇప్పుడు ఆలోచిస్తే తెలుస్తుంది– గురుమహిమ కష్టాలను ప్రసాదిస్తుందా? జన్మనెత్తిన తర్వాత కష్టసుఖాలు ఎలాగూ తప్పవు. నిజభక్తునికి అవన్నీ నీటిమీద వ్రాసిన గీతలలాగా జీవితంలో వచ్చి వెళ్ళిపోతుంటాయి. కానీ అంతులేని తృప్తి శాంతులతో అతడు ఆనందాన్ని అనుభవిస్తుంటాడు. అంతకంటే ఎవరికైనా కావలసినది ఏమున్నది?

ఈ కృతజ్ఞతా మహోత్సవ సందర్భంగా అట్టి అచంచలమైన గురుభక్తిని ప్రసాదించమని, ఈ గురుపూర్ణిమ నుంచి అయినా అట్టి గురుభక్తిని అలవరచుకునే శక్తిని అనుగ్రహించమనీ సద్గురు శ్రీ సాయినాథుని స్వరూపమైన పూజ్యశ్రీ మాస్టరుగారిని మనసారా ప్రార్థిద్దాము.

జై సాయి మాస్టర్!

## ఆస్తి-నాస్తి

05వ పేజీ తరువాయి

కనిపించనంతమాత్రాన ప్రకృతిలో అట్టివి లేనేలేవు అనడం శాస్త్రీయం కాదు.

మౌలికమైన ఆధ్యాత్మవాదాన్ని తార్కికంగా అసత్యమని నిరూపించలేని వారెందరో భారత, రామాయణాదులను విమర్శించడంతో శ్రోతలను అసలైన సమస్యనుండి ప్రక్కదారి త్రొక్కిస్తారు. ఆ గ్రంథాలు చారిత్రకమైనా, కాకపోయినా వాటికి ఆధారమైన ఆధ్యాత్మికత సత్యమైతే దానిననుసరించి ఎట్టికొరతాలేని ఆనందాన్ని పొందడమొక్కటే నిజమైన తెలివితేటలు. తక్కినదంతా వ్యర్థ ప్రలాపమే! ఏమంటావ్?"

# మాతృదేవి స్మృతులు

*శ్రీమతి కనకదుర్గ, హైదరాబాద్*

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి లీలావైభవాన్ని హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీమతి కనకదుర్గ ఈవిధంగా తెలియచేస్తున్నారు.

నేను 2020 మార్చి నెలలో కరోనా ప్రభావంతో లాక్-డౌన్ విధించినప్పటినుంచి అందరినీ కరుణించమని, కాపాడమని పూజ్యశ్రీ అమ్మగారికి సంకల్పం చెప్పుకుని ప్రతిరోజూ పూజ్యశ్రీ అమ్మగారి అష్టోత్తరం చదువుకునేదాన్ని. మనం ఇంట్లో కూర్చుని అంతంతమాత్రంగా ప్రార్థించినా పూజ్యశ్రీ అమ్మగారు ఏవిధంగా నన్ను కరుణించి కాపాడారన్నదే నా అనుభవం.

క్రిందటి ఏడాది 2020 డిసెంబర్ నెలలో మా అన్నయ్య శ్రీనివాస్ కి కరోనా వచ్చి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ఆసుపత్రిలో చేర్చవలసివచ్చింది. అన్నయ్య ఆరోగ్యం కోసం పూజ్యశ్రీ అమ్మగారిని ద్వారకబాబుగారు, వేదమ్మగారి ద్వారా ప్రార్థించగా పూజ్యశ్రీ అమ్మగారు అభయమిచ్చారు. తత్ఫలితంగా మా అన్నయ్య కొద్దిరోజుల్లోనే కోలుకొని ఆసుపత్రినుంచి ఇంటికి వచ్చాడు.

2021 మే 8 వ తేదీన మా బాబుకి నలతగా వుండటంతో డాక్టర్ సూచన మేరకు పరీక్ష చేయించగా కరోనాగా నిర్ధారణైంది. తిరిగి వేదమ్మగారు, ద్వారకబాబుగారి ద్వారా పూజ్యశ్రీ అమ్మగారిని ప్రార్థించగా మరలా అభయమిచ్చారు. మా బాబుని పరీక్ష చేసిన డాక్టర్ గారు, “పిల్లవాడికి ఒబేసిటీ కారణంగా ఆసుపత్రిలో చేర్చాల్సి రావచ్చు!” అని చెప్పారు. కానీ పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల మా బాబుని ఆసుపత్రిలో చేర్చకుండానే మూడు రోజుల్లో సాధారణ స్థితికి వచ్చాడు. ‘హమ్మయ్య!’ అని ఊపిరి పీల్చుకున్నాము. తరవాత డాక్టర్ల సలహామేరకు మా కుటుంబసభ్యులందరమూ కరోనా పరీక్ష చేయించుకున్నాము. అప్పుడు నేను పూజ్యశ్రీ అమ్మగారిని ఒక్కటే అడిగాను, “అమ్మగారూ.. మా అబ్బాయికి తగ్గించారు. మా అత్తమామలు వృద్ధులు (80, 75 సం.లు). దయచేసి వారికి రాకుండా చూడండి!” అని. అదేవిధంగా వారిద్దరికీ నెగెటివ్, నాకు, మా వారికి పాజిటివ్ వచ్చింది!

తిరిగి మళ్ళీ పూజ్యశ్రీ అమ్మగార్ని శరణువేడాను. నేను వేదమ్మగారికి మెసేజ్ పెట్టినప్పుడల్లా పూజ్యశ్రీ అమ్మగారినడిగి నాకు సమాధానం చెప్పేవారు. వేదమ్మగారి సూచన మేరకు చెంగయ్యగారి దగ్గర హోమియో మందు తీసుకున్నాను. వారిచ్చిన మందులు కొద్దిరోజులు వాడాక ఊపిరితిత్తుల పరిస్థితికోసం సిటిస్కాన్ తీయించమన్నారు. చెంగయ్యగారి హోమియో మందు వాడిన కారణంగా నాకు 7 పాయింట్స్ వచ్చాయి. అంటే సాధారణ పరిస్థితి. కానీ ఊబకాయం, రక్తహీనత, థైరాయిడ్ సమస్యలు వుండటంతో నన్ను ఆసుపత్రిలో చేరమన్నారు. నేను ఆసుపత్రిలో చేరాక రెండురోజులపాటు సాధారణ గదిలోనే వుంచి, తరువాత అవసరమని చెప్పి ICU కి మార్చారు. పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల నేను ఎట్టి ఆందోళన చెందకుండా ధైర్యంగా వుండేదానిని. కొద్దిగా ఓపిక వచ్చాక శ్రీ సాయిలీలామృతం, మహాత్ముల ముద్దుబిడ్డడు పారాయణ చేసుకునేదాన్ని. అదే సమయంలో పూజ్యశ్రీ అమ్మగారు ఆన్లైన్

సత్సంగానికి అనుమతిచ్చారు. ఆరోజు ఆశీస్సులకోసం సత్సంగంలో నా పేరు చదివారుట. మర్నాడే నన్ను మామూలు గదికి మార్చారు. కానీ నా పరిస్థితి అంతా బాగున్నా, నన్ను ఆసుపత్రినుంచి విడుదలచేయటం లేదు. రోజురోజుకీ బిల్లు పెరిగిపోతోంది. అప్పటికి 15 లక్షల బిల్లు కట్టాలని చెప్పారు. నాకు అప్పుడు ఆందోళన మొదలైంది. ఎట్టకేలకు జూన్ 1 వ తేదీ రాత్రి 10 గంటలకు ఇంటికి పంపించారు. నేను ఇంటికి వచ్చాక, 'నన్ను అనవసరంగా అన్ని రోజులు వుంచితే ఎందుకు మీరు అడగలేద'ని మావారిని కోప్పడ్డాను. ఇక్కడ పూజ్యశ్రీ అమ్మగారు ఒక అద్భుతం చేశారని మావారి సమాధానం విన్నాక అర్థమైంది. "ఇన్నిరోజులు పంపించడం ఆలస్యమవ్వడం మనకు ఒక వరమైంది. రెండోరోజే పంపించినా పదిహేను లక్షలు కట్టవలసివచ్చేది. ఈలోపున ఆ ఆసుపత్రిలో ఎక్కువగా డబ్బు వసూలు చేస్తున్నారని ఎవరో పిర్యాదు చెయ్యడంవల్ల, అది ఋజువవ్వడం వల్ల, సగానికి బిల్లు తగ్గించి 7 లక్షలు వేశారట! ఇదంతా పూజ్యశ్రీ అమ్మగారి దయ కాక మరేమిటి?" అన్నారు మావారు. అది విని కృతజ్ఞతతో నాకళ్ళు చెమర్చాయి.

ఇంటికి రాగానే వేదమ్మకి మెసేజ్ పెట్టి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. కానీ ఊహించని విధంగా 3వ తేదీ పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందారన్న పిడుగులాంటి వార్త నన్ను దుఃఖ సాగరంలో ముంచివేసింది. అందులో అంతకు ముందే పూజ్యశ్రీ అమ్మగారి అపారకరుణను పొందివున్నానేమో, ఊహించని ఈ పరిణామాన్ని తట్టుకోలేక బాగా ఏడ్చాను.

అయితే పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందాక కూడా నన్ను, నా కుటుంబాన్ని ఎంతలా కాపాడారో ఆ సంఘటనలు ఇప్పుడు మీకు చెప్తాను.

నేను ఆసుపత్రినుంచి వచ్చేసరికి మావారు బాగా చిక్కిపోయి నీరసంగా వున్నారు. మళ్ళీ ఆయనకు పరీక్ష చేయిస్తే షుగర్ రీడింగ్ 637 వుంది. నాకు మతిపోయింది.

ఇంత రీడింగ్ వుంటే ఏమవుతుందో షుగర్ వున్నవాళ్లందరికీ తెలుస్తుంది. మళ్ళీ నాకు దిక్కెవరు? పూజ్యశ్రీ అమ్మగారే కదా! వెంటనే ఈ విషయాన్ని వేదమ్మగారికి తెలియచేసాను. చిత్రంగా ఒక్క నెల రోజులు అల్లోపతి వైద్యం చేయించుకుంటే, రీడింగ్ నార్మల్ కి వచ్చేసింది(90,120)!! ఇంతకన్నా అద్భుతం ఇంకేమన్నా వుంటుందా? శరీరం వదిలిన తరువాత కూడా పూజ్యశ్రీ అమ్మగారు నాలాంటివాళ్ళ బాధ్యత వహిస్తూనే వున్నారనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏముంటుంది?

కరోనానుంచి బయటపడినా బ్లాక్ ఫంగస్ వచ్చే అవకాశం వుందని వార్తలలో విన్న నేను, నాకు అలాంటి లక్షణాలున్నాయేమోనని అనుమానంతో బాగా ఆందోళనపడ్డాను. అదేవిధంగా మా అబ్బాయి సంజయ్ కి బాగా ఆయాసం, 103 డిగ్రీల జ్వరం వచ్చింది. అప్పుడు శ్రీ గుత్తి శ్రీనివాస్ గారి దగ్గర హోమియో మందు వాడేదాన్ని. మళ్ళీ వేదమ్మగారికి మెసేజ్ పెడితే పూజ్యశ్రీ అమ్మగారికి ప్రార్థన చేస్తానని చెప్పారు. అదేవిధంగా అతి కొద్దిరోజుల్లోనే మేమిద్దరం కోలుకున్నాము. ఇన్ని జరుగుతున్నా మా అత్తమామలు క్షేమంగా వున్నారు. అందువల్ల నేను కొంతైనా ప్రశాంతంగా వుండగలిగాను. ఇన్నివిధాలా పూజ్యశ్రీ అమ్మగారి అపారకరుణ, సంపూర్ణ రక్షణ పొందగలిగాను.

అంతేకాదు, గురుకుటుంబం మొత్తం నాపై విపరీతమైన ఆదరణ చూపించారు. 1995 వ సంవత్సరంలో మొట్టమొదటిసారి మా అమ్మ ఒంగోలులో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం చేసుకున్నారట. అప్పటికే మా నాన్నగారు కాలం చేశారు. మేము 8 మందిమి ఆడపిల్లలం, ముగ్గురు మగపిల్లలు. మొత్తం 11 మంది పిల్లలం. చివరి నలుగురిని... అంటే, ఒక అన్నయ్య, ఇద్దరు అక్కలు, నేను -- మా నలుగురిని పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి తీసుకువెళ్లి, మొదటిదర్శనంలోనే, "వీళ్ళ నలుగురి బాధ్యత మీదేనమ్మా!" అని మా అమ్మ చెప్పిందట. పూజ్యశ్రీ అమ్మగారు అంగీకారంగా తలవూపారట. ఆప్రకారంగా మమ్మల్నందరినీ ఇప్పటికీ కాపాడుతూనే వుంటారు. మేము వారికి చేసింది ఏమీ లేదు.

ఎటువంటి అర్హత లేకపోయినా ఆదరిస్తున్న పూజ్యశ్రీ అమ్మగారిని, గురుకుటుంబాన్ని, శ్రద్ధాభక్తులతో, విశ్వాసంతో సేవించుకునే వివేకాన్ని ప్రసాదించమని, ఏ జన్మలోనూ మాచేయి వదిలిపెట్టవద్దని మనసారా ప్రార్థిస్తున్నాను.

జై సాయి మాస్టర్!

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

**శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.**

## పదవ ప్రసంగము

శ్రీ ప్రకాశానంద స్వామివారు త్ర్యంబకభాయితో జామ్-నగర్ నుండి పీఠడియా వెళ్ళినప్పుడు డాక్టర్ వీరజీభాయి ఇలా అన్నారు "నేను కూడా మీతో నిత్యానంద స్వామివారి దర్శనానికి రావాలని వున్నది. కానీ తొందరపని ఉండటం వలన ఆగిపోవలసి వస్తున్నది. ఈసారి మీరు వెళ్లేటప్పుడు నేను కూడా వస్తాను."

ఏడెనిమిది నెలల తర్వాత శ్రీ ప్రకాశానంద స్వామి వారు పోరుబందరుకు వెళ్లారు. అక్కడ నుండి వారు వీరజీభాయికి ఉత్తరం రాశారు "నేను పీఠడియా వెళ్లాల్సివుంది. కాబట్టి ఫలానా రోజుకు పీఠడియా రండి." ఇలా శ్రీ ప్రకాశానంద స్వామి, డాక్టర్ వీరజీభాయి యిద్దరూ పీఠడియాలో కలిశారు

శ్రీ నిత్యానందస్వామివారితో జరిగిన సంభాషణలో వీరజీభాయి ఇలా అన్నారు మొదట బెల్గాములో ప్లేగు వచ్చినప్పుడు నేను ప్లేగు డ్యూటీలో వున్నాను. అప్పుడు శ్రీ ప్రకాశానందస్వామివారిగురువుగారైనశ్రీలల్లూభాయిగారు బెల్గాములో వున్నారు. బెల్గాములో అప్పట్లో ఆయన ఒక్కరే గుజరాతీవారు. బయట నుంచి ఎవరైనా గుజరాతీవారు వస్తే మొదట ఆయనే ఆహ్వానించేవారు. నాకు కూడా వారి ఆతిథ్యం స్వీకరించే భాగ్యం కలిగింది. శ్రీ ప్రకాశానంద స్వామివారు కూడా అప్పుడు అక్కడే వున్నారు. ఇది జరిగి 20, 25 సంవత్సరాలయింది. మా అబ్బాయి త్ర్యంబకభాయి అనారోగ్యం వలన శ్రీ ప్రకాశానంద స్వామివారిని దర్శించగోరి వారిని మా ఇంటికి ఆహ్వానించాము. మొదట నేను ఆయనను కాషాయ వస్త్రాలలో చూశాను. కానీ యిప్పుడు వారు చేతిలో హాండీ, శరీరం మీద పాత గుడ్డలు గల వేషంలో ప్రత్యక్షమయ్యారు. ఈ వేషం చూస్తే 'వీరినెందుకు రప్పించామా?' అని మనసులో బాధ కలిగింది. కానీ ప్రసంగం తర్వాత చాలా కాలం క్రిందటి పరిచయం బయటపడింది.

### భార్యకు, సన్యాసికి మంచి వేషము అక్కరలేదు

స్వా॥ని॥ : త్యాగ పురుషులు (సన్యాసులు) మంచి

వేషము వేయరు. అందరికీ ఇష్టం లేని వేషమే వేస్తారు.

*'సువర్ణం పట్టచైలం చ శోభా స్యాత్ వారయోషితామ్'* అని చెప్పబడింది. బంగారు అలంకరణలు, పట్టువస్త్రాలు – యివన్నీ వేశ్యలకు శోభ కలిగిస్తాయి. పతివ్రత ఒకే భర్తకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఆమెకు వస్త్రాలంకారముతో పని ఏముంది? భర్త ఆమె శీలము మొదలైన సద్గుణాల చేత ఆనందిస్తాడు. వేశ్య ప్రపంచాన్ని ఆనందింప చేయడానికి అనేక అలంకారాలు, ఆభరణాలు ధరించి ఆడంబరంగా వుండాలి. ఈ విషయంలో భక్తవర్యుడైన 'అఖా' యిలా చెప్పాడు:

***పతివ్రతా తే, జే పతినే భజే,***
***అనాయాసే అవరనే తజే;***
***తేనాం వస్త్ర సాంధ్యాం జేమతేము***
***తేనీ బరోబరీ వేశ్యా కరశే కేమ?***
***అఖా పతివ్రతా కురూపిణీ హోయి,***
***పణ మోటోగుణ మాంహే పతివ్రత జోయి,***
***పతివ్రతా తే, జే నాచుం వదే,***
***సాచుం బోల్యుం కేనేన సదే;***
***సాచుం తో లీమడానుం సాన్,***
***తేమ కడవుం లాగే సర్వే జ్ఞాన్;***
***కడవే రోగ కాయానో జాయి,***
***అఖా మీఠాణే రోగ బమణో థాయి***

భావం: పతివ్రత భర్తను తప్ప మరెవరిని కన్నెత్తి చూడదు. ఆమె చినిగిన, చినుగులు కుట్టిన గుడ్డలను ధరించినా, వేశ్య ఆమెకు సాటి అవుతుందా? ఓ అఖా! పతివ్రత ఎంత కురూపిణి అయినా సౌశీల్యగుణము వలన ఆమె శోభిస్తుంది. ఆమె ఎప్పుడూ నిజమే చెబుతుంది. సత్యమే హితకరమైనది. సత్యము వేపాకు లాంటిది. అలాగే జ్ఞానము కూడా వేపాకు లాగానే చేదుగా వుంటుంది. కానీ వేపాకు రోగాలను తగ్గిస్తుంది. రుచికరమైన పదార్థాలు రోగాన్ని పెంచుతాయి.

ఇలానే భగవంతుని రంజింపచేయదలచిన వారికి చినిగిన బట్టలు అడ్డు రావు. ప్రపంచాన్ని రంజింప చేయదలచిన వారికి మాత్రం వస్త్రాలంకరణలు అవసరమవుతాయి.

శాస్త్రాలలో ఇలా ఉన్నది:

***శ్లో॥ విశీర్ణాన్యమలాన్యేవ***
***చైలాని గ్రథితాని తు I***
***కృత్వా కన్థాం బహిర్వాసో***
***ధారయేత్ ధాతురంజితామ్ II***

భావం: ప్రజలు బయట పారేసిన చినిగిన పాత గుడ్డ పీలికలను తీసుకొని శుభ్రం చేసుకుని, బొంత కుట్టుకొని, కాషాయ రంగు వేసుకుని ధరించాలి.

అలింగ సన్యాసులు రంగు వేయకుండా ధరిస్తారు. లింగ సన్యాసులు రంగు వేసుకొని ధరిస్తారు.

స్వామివారు మొదట లింగ సన్యాసంలో వుండేవారు. ఇప్పుడు అలింగ సన్యాసంలో వున్నారు. పైకి తెలియకుండా వుండడానికే ఈ వేషము.

### జన సంపర్కం విడవడం సన్యాసుల ధర్మము

***శ్లో॥ విద్వాన్ స్వదేశ ముత్సృజ్య***
***సంన్యాసానన్తరం స్వతః I***
***కారాగార వినిర్ముక్త***
***చోరవత్ దూరతో వసేత్ II***

భావం: "సన్యాసాన్ని స్వీకరించిన తర్వాత విద్వాంసుడు తనకు పరిచయమైన ప్రదేశాన్ని విడిచి, ఖైదు నుండి బయటికి వచ్చిన దొంగలాగా ప్రజలకు దూరంగా వుండాలి" అని ఉపనిషత్తులు చెబుతున్నాయి

ఒకప్పుడు భర్తృహరి, గోపీచందుడు కలిసి వున్నారు. ఒకరోజు వారు సంచారము చేస్తూ ఒక రాజ్యపు ప్రధాననగరము బయటకు చేరారు. ఎవరో అక్కడి రాజుకు 'భర్తృహరి, గోపీచందుడు వచ్చారు' అని తెలిపారు. అది తెలుసుకొని రాజు వెంటనే వారిద్దరూ వేంచేసివున్న ప్రదేశానికి వెళ్ళాడు. అప్పటికి భర్తృహరి, గోపీచందుడు భిక్ష తెచ్చుకొని వున్నారు. రాజు వారిని కలుసుకోవడానికి వస్తున్నాడని భర్తృహరికి తెలిసింది. 'మనం ఏదో ఒక ఉపాయంతో ఈ రాజుగారితో కలయిక నుంచి తప్పించుకోవాలి' అని గోపీచందుడితో కలిసి ఆలోచించాడు. వారు అప్పటికప్పుడు ఒక స్పర్ధ కల్పించుకొని యిలా పోట్లాడుకున్నారు: "నేను తెచ్చిన రొట్టెలలో ఎక్కువ భాగం నీవెలా తీసుకున్నావు?" అని భర్తృహరి గోపీచంద్రుడితో

అన్నాడు. అప్పుడు గోపీచందుడు యిలా సమాధానం చెప్పాడు: "నిన్న నేను చాలా రొట్టెలు అడిగి తెచ్చాను. నీవు ఎక్కువ యిచ్చావా!?" ఇలా వారిద్దరూ రొట్టెముక్కల ఎదుట నిలబడి పోట్లాడుకోసాగారు. అప్పుడు రాజు తన వద్దకు పై వార్త తెచ్చిన వ్యక్తి మీద కోపగించి ఇలా భావించాడు: ఈ విధంగా రొట్టెల కోసం పోట్లాడుకునేవారు భర్తృహరి, గోపీచందుడు ఎలా కాగలరు? వీరు భిక్షకులు. రొట్టెముక్కల కోసం పోట్లాడుకుంటున్నారు. ఇలా భావించి వెనుకకు వెళ్ళిపోయాడు.

అలా ఈ ప్రకాశానంద స్వామివారు కూడా గుప్తంగా వుండడానికి అలింగ సన్యాసము తీసుకున్నారు.

స్వా॥ప్ర॥ : మీరు నా విషయంలో గొప్ప గొప్ప ఉపమానాలను యిస్తున్నారు. సన్యాసం సంగతి అటు ఉంచండి. నేను హిందువును కాదు, మహమ్మదీయుడని కాదు.

స్వా॥ని॥ : (నవ్వుతూ శ్రీ ప్రకాశానంద స్వామి వారితో) ఇది మరీ బాగుంది!

***హిందూ మహమ్మదీయ మొదలైన ఉపాధుల వలన దుఃఖము***

ఇద్దరు సాధువులు వుండేవారు. వైశాఖమాసంలో వారి కాళ్లు ఎండలకి మాడిపోతున్నాయి. అది చూసి ఎవరో వారికి కాళ్లకు చెప్పులు తొడిగారు. వారిలో ఒకడు దేవాలయాలు, మసీదులు మొదలైన పవిత్రస్థలాలకు చెప్పులతో వెళ్ళాడు.

'నీవెవరివి' అని ఎవరైనా అడిగితే, "ఎవరో ఒకడినిలే" అని సమాధానం చెప్పేవాడు. ప్రజలు అతనిని పిచ్చివాడని భావించి ఆలయం బయటికి తీసుకువచ్చి వదిలిపెట్టేవారు.

అలాగే రెండవవాడు కూడా చెప్పులతో మసీదులోకి వెళ్ళాడు. మహమ్మదీయులు "నీవెవరివి?" అని అడిగారు. ఆయన "నేను హిందువును" అని చెప్పాడు. అప్పుడు మహమ్మదీయులు అతనిని గట్టిగా కొట్టి తరిమికొట్టారు.

దెబ్బలు తిని ఆ సాధువు తన చోటికి వచ్చాడు. నీరసంతో పడుకున్నాడు. రెండవ సాధువు వచ్చి అతను పడుకోవటం చూసి అతనితో, "నీకు ఏమైంది? అప్పుడే ఎందుకు పడుకున్నావు?" అని అడిగాడు.

"నన్ను మహమ్మదీయులు కొట్టారు. ఒళ్లంతా నొప్పులుగా వుంది" అని అతడు జవాబు చెప్పాడు.

"ఎందుకు కొట్టారు?" అని అడిగాడు రెండవ సాధువు.

జరిగిన విషయం వివరించాడతడు.

"నీవు హిందువువు. చెప్పులతో మసీదులోకి వెళ్లావు. అందుకే కొట్టారు. నీవు హిందువునని గాని, ముస్లిమునని చెప్పకపోతే బాగుండేది."

దీని మీద వీరజీభాయి ఈ సందేహాన్ని వెలిబుచ్చాడు:

"సన్యాసి ఎప్పుడూ గుప్తంగానే వుండాలని శాస్త్రాలలో చెప్పబడి వున్నదా?"

**- సశేషం**

# పరిప్రశ్న

06వ పేజీ తరువాయి

ఒక్కయింటి భిక్షతో తృప్తిపడ వచ్చుగదా అన్ని ప్రశ్నిస్తే, ***"బైక్షణెవర్తయే నిత్యంనై కాన్నదీ భవేద్యతి"*** ("ప్రతిరోజు యతి పెక్కు యిండ్లకడ తెచ్చుకున్న అన్నమునే తినవలెను కాని ఒక్కయింటి అన్నము తినరాదు").

***"భిక్షాహారీ నిరాహారే భిక్షానైవ ప్రతిగ్రహః! అసంతోవాపిసంతోవా సామపానందినేదినే"***

(భిక్షాహారము భుజించే వాడు నిరాహారి! భిక్షను అడగటం వల్ల ప్రతిగ్రహదోషం అంటదు. సజ్జనుడినుండైనా దుర్జనుడినుండైనా ఎవడు భిక్షను యాచించి భుజిస్తాడో వాడు ప్రతిదినము అమృతపానము చేసినవాడగుచున్నాడు.)

పై ధర్మాలన్నీ పాటించి ప్రమాణంగా నిలిపిన ధర్మావతారుడు శ్రీ సాయిబాబా.

2) బాబాను మహమ్మదీయులు పూజించరని ఎవరన్నారు? బాబాను మహమ్మదీయులూ ఆరాధిస్తారు. శిరిడీ దర్శించిన వారికీ అనుమానం రాదు. మశీదులో జరిగే విగ్రహారాధన మొ॥న హైందవ పూజాదికాలు ముస్లింలకు నిషిద్ధం కనుక ఆ కార్యక్రమాలలో పాల్గొనడానికి కొందరు ముస్లింలకు అభ్యంతరము, కొందరికి భయమూ ఉండటము సహజమే.

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

***శ్రీమతి శ్రీదేవి***

శ్రీ ఆనందమయి అమ్మ తన జీవితంలో ఎన్నో కష్టతరమైన పరిస్థితులను ఎదుర్కొన్నారు. చిన్ననాటి నుండి కూడా అమ్మ తరచూ సమాధి స్థితిలో పడిపోతూ బాహ్యస్మృతిని కోల్పోతుండేవారు. అది సమాధిస్థితి అని తెలియక మొదట్లో అందరూ అది ఒక హిస్టీరియా వంటి జబ్బుగా భావించి వైద్యులకు చూపించేవారు. మరికొందరు, ముఖ్యంగా అత్తవారింట్లో బంధువులంతా ఆమె వేళాపాళా లేకుండా నిద్రపోతుందంటూ విమర్శిస్తుండేవారు. అయితే అమ్మలో విశేషమేమంటే తనను విమర్శించిన వారిపై అమ్మ ఏనాడూ ఏమాత్రమూ కోపించి ఎరుగరు.

ఎన్ని నిందలు, విమర్శలు ఎదురైనా వాటికి ఏమాత్రం చలించక ఎటువంటి పరిస్థితిలోనయినా ధైర్యంతో, శాంత మనస్కురాలై స్థిరచిత్తంతో వ్యవహరించేవారే గానీ ఏమాత్రమూ వ్యాకులత, ఆందోళన అమ్మలో కన్పించేది కాదు. ఇంటి పనులు, యింట్లోని వారి సేవలు, ప్రత్యేకించి తన భర్త భోలానాథ్ గారి సేవలు ఏమరక చేసేవారు. ఎల్లప్పుడూ ఆనందంగా కన్పించేవారు. అమ్మలోని దివ్యత్వాన్ని తెలియనివారు, అమ్మ ఎడల భక్తిభావం లేనివాళ్ళు కూడా అమ్మ యేనాడూ అశాంతిగా అసంతృప్తిగా వుండటం చూడలేదన్న విషయం చెపుతుంటారు.

శ్రీ ఆనందమయి మాత భక్తులలో ప్రాణగోపాల్ బాబు ఒకరు. ఆయనకు చిన్ననాటి నుండి దైవభక్తి ఎక్కువ. ఆయన తన జీవితాన్ని ఆధ్యాత్మిక సాధనకు అంకితం చేయాలన్న సంకల్పంతో ఉద్యోగానికి రాజీనామా చేసి పెన్షన్ తీసుకుంటూ దేవఘర్ అనే వూరిలో ఆశ్రమవాసియై వున్న ఒక స్వామీజీని సేవిస్తూ వుండేవాడు. ఆశ్రమ సమీపంలోనే ఒక యిల్లు అద్దెకు తీసుకుని భార్యాపిల్లలతో నివసిస్తుండేవాడు. నిరంతరం దైవచింతనలోనే గడిపేవాడు. అతనికి శ్రీ ఆనందమయి మాతపై ఎనలేని భక్తి. తరచు అమ్మ దర్శనార్థం



వస్తుండేవాడు. అతడు అమ్మను దేవఘర్ కు రావలసిందిగా ఎన్నోసార్లు ప్రార్థించటంతో ఒకసారి అమ్మ దేవఘర్ వెళ్ళారు.

1926వ సం॥ వైశాఖమాసంలో అమ్మ దేవఘర్ వెళ్ళారు. అమ్మను భోలానాథ్ గారు, మరికొందరు భక్తులు అనుసరించారు. ముందుగా కలకత్తాలోని అమ్మ భక్తుడు అయిన ప్రమథ్ బాబు ఆహ్వానము మేరకు అతని యింటిలో ఒకటి రెండు రోజులుండి అందరూ దేవఘర్ వెళ్ళారు. అమ్మ తన

యింటికి వచ్చినందుకు ప్రాణగోపాల్ పొందిన ఆనందానికి అవధులు లేవు. అమ్మ వున్నన్ని రోజులూ ఎంతో భక్తితో అమ్మను పూజించుకొన్నాడు. అమ్మ వెంట వచ్చిన వారందరినీ ప్రతిరోజూ విందు భోజనాలతో సత్కరించాడు. ఒకరోజు అతడు అమ్మను స్వామీజీ అశ్రమానికి తీసుకెళ్ళాడు. అమ్మ భక్తులందరితో కలసి అక్కడకు వెళ్ళారు. గొప్ప సిద్ధపురుషుడైన ఆ స్వామీజీ వయస్సు వంద సంవత్సరాలకు పైన వుంటుందని అక్కడివారు చెప్పారు. ఆ ఆశ్రమంలో ఎందరో బ్రహ్మచారులు సాధన చేసుకొంటున్నారు. అమ్మ వెళ్ళే సమయానికి స్వామిజీ ధ్యానమందిరంలో వున్నారు. ప్రాణగోపాల్ బాబు అమ్మను ధ్యాన మందిరం లోని స్వామీజీ వద్దకు తీసుకుని వెళ్ళాడు. అమ్మ దర్శనంతో స్వామిజీ అవధులు లేని ఆనందంతో నమస్కారం చేసుకుని అమ్మతో తనకు అమ్మ లోగడ స్వప్న దర్శనమిచ్చి అనుగ్రహించిన విషయం తెలియజేశాడు. ఆయన అమ్మతో ప్రతిరోజూ ఆధ్యాత్మిక చర్చలు జరుపుతూ అమ్మ నుండి తన సందేహాలకు సమాధానాలను సాధనలోని మెళకువలను తెలుసుకొంటుండేవాడు. ముఖ్యంగా, అద్వైత సిద్ధాంతం గురించిన స్వామిజీ సందేహాలను అమ్మ ఎంతో సులభతరమైన వివరణలతో ఆయనకు అర్థమయ్యే రీతిలో బోధించి అనుగ్రహించారు. తన సందేహాలు నివృత్తి కావటంతో స్వామిజీ సంతోషంతో అమ్మకు పాదాక్రాంతుడైనాడు.

స్వామీజీ ఒకరోజు అమ్మకి స్వహస్తాలతో పూరీలు తినిపించారు. మరోరోజు భోజనం తినిపించారు. ఆయన అమ్మకు ఒక ఎర్రనివస్త్రము, రుద్రాక్షమాల సమర్పించుకున్నారు. ఆ రోజు అమ్మ స్వామీజీ చేయి పట్టుకుని ధ్యానమందిరం లోకి తీసుకొనివెళ్ళి ఎంతోసేపు సంభాషించారు. స్వామీజీ తలపైన చేయి పెట్టి అమ్మ స్వామిజీని ఆశీర్వదించారు. అమ్మ, "కొంతకాలం యిక్కడ వుండి, ఆ తర్వాత తపోవనం వెళ్ళి అక్కడ నీ సాధన కొనసాగించు" అన్నారు. అమ్మ ఆదేశం ప్రకారం అతడు అదే విధంగా తపోవనంలో కొంతకాలం గడిపి దేవఘర్ తిరిగి వచ్చాడు. అలా ఆనందమయి అమ్మ దేవఘర్ లోఒక వారం రోజులుండి భక్తులతో కలసి తిరిగి షాహ్-బాగ్ చేరుకున్నారు.

వివాహమయిన తర్వాత కొన్ని సంవత్సరాలపాటు అమ్మ చాలా గుప్తంగా తన మహిమ ఎవ్వరికీ వ్యక్తపడనీయకుండా వ్యవహరించేవారు. ఆ తర్వాత కూడా భక్తుల ఎదుటకు మేలిముసుగు లేకుండా వచ్చేవారు కాదు. వచ్చినా ఏమీ మాట్లాడేవారు కాదు. వచ్చిన భక్తులు ఆమెతో మాట్లాడాలని ఎంతగానో ఆశించేవారు. కొందరు భోలానాథ్ గారితో తమ బాధ వ్యక్తపరుచుకొని, అమ్మను తమతో మాట్లాడవలసిందిగా చెప్పమని ప్రార్థించేవారు. ఆయన అప్పుడప్పుడు అమ్మతో "వీరందరూ తమ సమస్యలను నీతో చెప్పుకోవాలని అనుకొంటున్నారు. వారితో మాట్లాడరాదా" అనేవారు. అప్పుడు అమ్మ అదే ఆయన ఆజ్ఞగా భావించి భక్తులతో మాట్లాడేవారు.

కొన్ని సంవత్సరాల తర్వాత అమ్మ వైఖరిలో చాలా మార్పు వచ్చింది. అమ్మ భక్తులతో మమేకమై మెలగసాగారు. ఆమె మేలిముసుగు ధరించటం కూడా చాలా వరకు తగ్గించి, పిల్లల వద్ద తల్లిలాగా కూర్చుని నిస్సంకోచంగా మాట్లాడసాగారు. శ్రీ ఆనందమయి అమ్మను చాలామంది భక్తులు తమ తమ గృహాలకు తీసుకుని వెళ్ళేవారు. అమ్మ తమ యిండ్లకు రాలేదని కొందరు భక్తులు వాపోతుంటే అమ్మ వాళ్ళతో "మీరు మీ యిండ్లకు నేను రాలేదని బాధ పడవద్దు. నేను ఎవరు ఎక్కడకు తీసుకుని వెళ్తే అక్కడకు వస్తున్నాను. రోజు రోజుకు అంతా శరీరంలో మార్పులు వస్తున్నాయి. ఇంతకు ముందు వలె ఎక్కడికీ కాలినడకన వెళ్ళలేక పోతున్నాను. మీరు బండిలో ఎక్కడికి కావాలంటే అక్కడకు తీసుకుని వెళ్ళవచ్చు. మీరు యీ విషయంలో ఎలాంటి ఆందోళన చెందనక్కరలేదు" అనేవారు.

ఒకరోజు షాహ్-బాగ్ లో అమ్మ చుట్టూ భక్తులందరూ కూర్చుని వుండగా అమ్మ వారందరితో దృఢ గంభీరస్వరంతో యిలా అన్నారు: "చూడండి, నిజంగా నేను బిడ్డను. అయినా మీరంతా నన్ను 'అమ్మా' అని పిలుస్తున్నారు. మీ మనసులో మీకు నిజంగా నేను మీ అమ్మను అన్న భావన వున్నట్లయితే నేను ఎక్కడుంటే అదే నా యిల్లు. అంటే మన యిల్లు కదా! ఇదిగో, యిది కూడా మన యిల్లే. ఇది మన అందరి యిల్లు. మనసులో ఎటువంటి భేద భావనలకు తావీయవద్దు."

"ఇక్కడ యిలా

కలుసుకొంటున్నారు. మీ మనసులలో ద్వేషము, హింస మొదలయిన దుర్గుణాలను తొలగించుకోవడానికి ప్రయత్నించండి. ఇతరులపట్ల ప్రేమానురాగాలతో మెలగాలి కానీ, యితరులపై నిందలు వేయటము, హింసించటము యీ విధమైన ప్రవర్తనతో వుంటే యిక్కడకు వచ్చి మాత్రం మీరు పొందే ప్రయోజనం ఏమి వుంటుంది? అన్నింటికంటే ముందు సత్ప్రవర్తన అలవరచుకోవటం అనేది చాలాముఖ్యం." ఇలా అనేక విషయాలు బోధించేవారు శ్రీ ఆనందమయి అమ్మ

ఆరోజు అమ్మ భక్తుల నుద్దేశించి యింకా యిలా చెప్పారు:

"ఇక్కడికి వచ్చే వారంతా ఆధ్యాత్మికంగా ముందడుగు వేయాలి. ఇంతవరకు ఎవ్వరికీ ఆధ్యాత్మికంగా ఒక్క అడుగు కూడా సరిగా ముందుకు సాగలేదు. ఇప్పుడిప్పుడే నేలపై కాలుమోపి తప్పటడుగుల స్థాయిలో మాత్రమే వున్నారు. జరిగింది అంతమాత్రమే. జరుగవలసింది ఎంతో వుంది.

మీయొక్క యీ ప్రయాణం ఎంతో క్లిష్టతరమయినది. దారిలో ఎన్నో సుడిగాలులు వీస్తాయి. ఎన్నెన్నో తుఫానులు సంభవిస్తాయి. అనేకరకాల కష్టాలను సహించవలసి వస్తుంది. వీటన్నిటినీ ఓర్పుతో ఎదుర్కొంటూ సహనంతో ముందుకు వెళ్ళగలిగిన వాడు లాభం పొందుతాడు. లేనివాడు ఎక్కడ వున్నవాడు అక్కడే వుండిపోతాడు" అన్నారు అమ్మ

శ్రీశ్రీ ఆనందమయి మాత, ఆమె భర్త భోలానాథ్ గారు నివసించే తోట యజమాని అయిన రాయ్ బహద్దూర్ గారికి అమ్మ పట్ల ఎంతో భక్తిశ్రద్ధలు ఏర్పడ్డాయి. అతని కుటుంబంలోని స్త్రీలు కూడా అమ్మ దర్శనానికి తరచూ రావటం ప్రారంభించారు. మొట్టమొదటి రోజులలో అమ్మ సన్నిధిలో జరిగిన సంకీర్తనకు చాలామంది జనం వస్తుండటంతో తోటలోని మొక్కలు, చెట్లు పాడవుతాయనే వుద్దేశంతో సంకీర్తన కార్యక్రమం జరుపుకొనటానికి తోట యాజమాన్యం అంగీకరించలేదు. కొంతకాలం తర్వాత అమ్మ యొక్క దివ్యత్వాన్ని గుర్తించి, అమ్మపై భక్తిశ్రద్ధలతో కుటుంబంలోని ప్రతివ్యక్తి అమ్మను తరచు దర్శిస్తూ వుండేవారు. వారు తోటలో సంకీర్తన చేసేందుకు లోగడ అభ్యంతరం చెప్పినందుకు ఎంతో పశ్చాత్తాపంతో అమ్మను క్షమాపణ వేడి సంకీర్తనలు, సంతర్పణలు వంటి ఎటువంటి కార్యక్రమాలయినా జరుపుకొనవచ్చునని తెలియచేశారు. శ్రీ ఆనందమయి అమ్మ అప్పుడప్పుడు చిన్న పిల్లలవలె చిత్రవిచిత్రమయిన లీలలు చేసేవారు. ఒకసారి కొందరు భక్తురాండ్రు షాహ్-బాగ్ వచ్చినప్పుడు అమ్మ యింటిలో ఎక్కడా కనిపించలేదు. ఇల్లంతా వెదికి వారు అమ్మ ఏమైనారా అని ఆందోళనతో తోటంతా వెదికారు. అమ్మ ఒక చెట్టు కొమ్మ మీద కూర్చుని నవ్వుతూ కనిపించారు.

శ్రీ ఆనందమయి మాత గృహంలో ఒక రోజు సాయంత్రం సంకీర్తన జరుగుతున్నది. అప్పుడు ఒక విచిత్రమయిన సంఘటన జరిగింది. సంకీర్తన సమయంలో ఒకానొక అలౌకిక స్థితిలో వున్న అమ్మ వున్నట్లుండి లేచి నిలబడి గురుప్రియా దేవి తండ్రి గారి వద్దకు వెళ్ళి "నాకు మీ చరణ ధూళి కావాలి" అంటూ ఆయన పాదాలపై వంగారు. ఆయన అదిరిపడి కాళ్ళు వెనక్కి తీసుకున్నారు. అమ్మ "చరణధూళి యివ్వండి" అంటూ ప్రతి ఒక్కరి వద్దకు వెళ్ళటం, వాళ్ళు వెనుకకు తప్పుకొనటం చేయసాగారు. అమ్మ విచారంగా "నాకు మీరు మీ చరణధూళి యివ్వకపోతే నేనింక వుండను" అంటుంటే భోలానాథ్ గారు వచ్చి "నీకు చరణధూళి ఎవరిస్తారు? నువ్వే నీ చరణధూళి తీసుకో" అనగానే అమ్మ తన చరణధూళి తానే తీసుకుని, శాంతించి స్త్రీల మధ్యకు వచ్చి కూర్చున్నారు. గురుప్రియా దేవి తన మనసులో 'అమ్మ చరణధూళి యివ్వకపోతే నేనింక వుండను' అన్నప్పుడు ఎవరూ అమ్మ మాటకు ఎదురు చెప్పకూడదు. నన్ను అడిగితే నేను యిచ్చేదాన్ని. కానీ ఎందుకో అమ్మ నన్ను అడుగలేదు' అనుకొన్నది. అమ్మ "చరణధూళి యివ్వండి" అంటూ గురుప్రియా దేవి వైపు అడుగులు వేసి కూడా ఆగిపోవటం జరిగింది. అమ్మ శాంతించి స్త్రీల మధ్యలోకి వచ్చి కూర్చున్నపుడు మరలా అదే ప్రస్తావన తెచ్చారు. గురు ప్రియాదేవి "అమ్మా! నువ్వు అందరినీ అడుగలేదు. కొందరినే మాత్రమే అడిగావు. నువ్వు అడిగితే నీకు చరణధూళి యిచ్చేవారు యిక్కడ వున్నారు" అన్నది. అమ్మ నెమ్మదిగా "ఆ విషయం నాకు తెలుసులే. అందుకే వారిని నేను అడుగలేదు" అన్నారు.

శ్రీ ఆనందమయి మాత వద్దకు రోగపీడితులు ఎందరో వచ్చి తమ వ్యాధి నివారణ అయ్యేలా అనుగ్రహించమని కోరుతుండేవారు.

అమ్మ ఆశీస్సులతో స్వస్థత పొందేవారు. అయితే అనుభవించ వలసిన దుష్కర్మ ఫలాలను అనుభవింపజేసే క్రమంలో వ్యాధి నివారణ కాని సందర్భంలో అమ్మపై కినుక వహించేవారు. ఒకసారి గురుబంధు అను పేరు గల భక్తుని భార్య వచ్చి తన కుమారుని విషజ్వరం బారినుండి కాపాడమని అమ్మను ప్రార్థించింది. అమ్మ వారి యింటికి వెళ్ళి తమ స్వహస్తాలతో ఆ అబ్బాయికి ప్రసాదం తినిపించారు. ఆ అబ్బాయి త్వరలోనే ఆరోగ్యవంతుడైనాడు. అప్పటినుండి ఆమెకు అమ్మపై భక్తి మరింత పెరగటంతో అమ్మను తరచూ దర్శించసాగింది. ఒకరోజు అమ్మను ప్రార్థించి, ఆమె అమ్మను తన యింటికి తీసుకెళ్ళి ఆతిథ్యం యివ్వడం జరిగింది. అయితే ఆ రోజు వారింట్లో జరిగిన సంకీర్తన సమయంలో ఆనందమయి మాత భావావేశ స్థితిని పొందారు. ఆ దివ్యస్థితిని గురించి సరియైన అవగాహన లేని ఆ భక్తురాలు ఆరోజు నుండి అమ్మ వద్దకు రావటం మానివేసింది.

ఆమె యొక్క ఆ ప్రవర్తనకు భక్తులు కొందరు బాధపడి అమ్మతో విన్నవించినప్పుడు అమ్మ, "లోకంలో అందరూ మంచివాళ్ళే, చెడ్డవాళ్ళు ఎవరూ వుండరు. నన్ను అపార్థం చేసుకొని నిందించే వారిపై ఎవరూ కోపగించుకోవలసిన అవసరం లేదు. ఆధ్యాత్మిక చింతన, దైవభక్తి వీటిపట్ల దృఢవిశ్వాసం వున్నంత వరకు రాకపోకలు కొనసాగుతాయి.విశ్వాసం సన్నగిల్లినపుడు పలువిధాలయిన అనుమానాలతో వారివారి ప్రవర్తనలలో ఎన్నో మార్పులు వస్తూ వుంటాయి. ఇందులో ఎవరి తప్పు ఏమీ వుండదు. వారి సంస్కారబలం ఎంత వుంటే అంతగా విశ్వాసం, దృఢభక్తి వుండటం జరుగుతుంది.

అంతేకాదు, ఎవ్వరికైనా నిందలు ఆభరణాల వంటివి. అందునా యీ మార్గంలోకి అడుగుపెట్టిన తర్వాత నిందలను అలంకారాలుగా భావించాలి.ముత్తైదువుకు చేతిగాజులు ఎలా సౌభాగ్యదాయకాలో అపనిందలు కూడా శుభదాయకాలుగా భావించాలి. అవి మనకెంతో మేలు చేస్తాయని గుర్తించాలి. ఆధ్యాత్మిక జీవితానికి నిందలు అనేవి ఆ వ్యక్తి పురోగతికి ఎంతగానో దోహద పడతాయి. అసలు యీ మార్గంలో నడిచే వారికి నిందలు తప్పవు. కనుక బాగా గుర్తుంచుకోండి. నిందలకు ఎన్నడూ భయపడవద్దు. నిందించిన వారిపై కోపించవద్దు. ఈ భావనలన్నీ అధిగమించి ఆధ్యాత్మిక సాధనలో ముందుకు పోవడమే మన లక్ష్యం అన్న విషయం మరువక ధైర్యంగా సాగిపోవాలి" అని బోధించారు.

శ్రీ ఆనందమయి మాత ఒకరోజు సంకీర్తన అనంతరం చాలాసేపు మౌనంగా కూర్చున్నారు. భక్తులంతా అమ్మనే నిశ్శబ్దంగా చూస్తున్నారు. కొంతసేపటికి అమ్మ యిలా అన్నారు: "సాధారణంగా అందరూ లౌకిక విషయాల గురించి అడుగుతుంటారు. అయితే ఆధ్యాత్మిక సాధన గురించిన సందేహాలను కొందరు వ్యక్తులు అడిగినప్పుడు, నేను వారి సందేహాలకు సరియైన సమాధానాలు వివరించి తెలియజేసినప్పుడు, వారు తమ అనుమానాలు తొలగిపోవటంతో సాధనలో ముందుకు సాగిపోతారు. అయినప్పటికీ లౌకికమైన సందేహాలను కూడా మీరు అడిగి నానుండి తగిన సలహాలు పొందవచ్చు. అన్నింటికీ మీకు తగు సూచనలిచ్చి మిమ్ము సన్మార్గంలో నడిపించటమే నా సంకల్పం." అప్పుడు స్త్రీలంతా అమ్మను చాలా చిన్న చిన్న సాంసారిక విషయాలన్నింటి గూర్చి సమస్యలు చెప్పుకోసాగారు అమ్మ అందరి సమస్యలనూ విని వారికి తగు సలహాలనిచ్చి వారందరినీ సమాధానపరిచారు.

శ్రీ ఆనందమయి మాత ఎందరినో ఆధ్యాత్మికంగా ఉత్తమస్థితిని పొందేలా నడిపించారు, ఆశీర్వదించారు. భక్తుల పరిపక్వత స్థాయిల ననుసరించి వివిధ రకాలైన దీక్షల నిచ్చి, సాధనలు చేయించారు. ఢికాటులీ అనే వూరి నుండి నృపేంద్ర చంద్ర ఘోష్ అనే భక్తుని వెంట యోగేష్ చంద్ర రాయ్ అనే భక్తుడు అప్పుడప్పుడు షాహ్-బాగ్ వస్తుండేవాడు. అతడు ఢాకాలోనే ఉద్యోగం చేస్తుండేవాడు. భక్తి మార్గంలో వుంటూ, అతడు వివాహం చేసుకొనలేదు. నిరంతరం ఆధ్యాత్మిక సాధనలో గడుపుతుండేవాడు. ఆనందమయి అమ్మపై భక్తితో ఎన్నో పాటలు రచించి పాడుతుండేవాడు. షాహ్-బాగ్ వచ్చినపుడు అతడు అందరితో కలవక, సంకీర్తనలో పాల్గొనక, ఒంటరిగా ఏదో ఒక మూల కూర్చుని శ్యామా సంగీతమో, లేక భక్తి గీతాలో పాడుకుంటుండేవాడు.

**- సశేషం**

# పరసువేది

శ్రీ ఎమ్. సీతారామయ్య

(స్వభావో దురతిక్రమః అన్న నానుడికి విరుద్ధంగా రజోగుణాత్మకుడైన వీరు మాస్టరుగారి సంపర్కములోకి వచ్చిన తర్వాత వారి సన్నిధి ప్రభావం వల్ల వీరి స్వభావంలో పూర్తిగా మార్పు కలిగి సత్వగుణోపేతుడై, పదవీ విరమణానంతరం ప్రశాంతంగా తమ శేష జీవితాన్ని ఒంగోల్లో గడుపుతున్నారు.)

నేను 1977 జనవరిలో మాస్టరుగారి దర్శనానికి విద్యానగర్ వెళ్ళాను. అప్పుడు మాస్టరుగారు మల్బరీ తోటలో చెట్ల దగ్గర కూర్చుని వున్నారు. అక్కడ కూర్చుని కాసేపు మందిర విషయాలు మాట్లాడుకున్నాం. అలా కొంచెంసేపు మాట్లాడుకున్న తర్వాత భోజనానికి రమ్మన్నారు. నాకు ఎవరింట్లోనైనా భోజనం చెయ్యాలంటే చాలా మొహమాటం. అందువల్ల నేనెవరింటికీ భోజనానికి వెళ్ళను. కానీ మాస్టరుగారు చెప్పారని గత్యంతరం లేక కూర్చున్నాను. ఇంతలో కాకులు కావ్ కావ్ అని అరుస్తున్నాయి. అప్పుడు మాస్టరుగారుండి "చూడండి వారెవరో వచ్చారు. ముందు వారికి భోజనం అరేంజ్ చెయ్యండి" అన్నారు. అద్దైపోయిన తర్వాత భోజనం వడ్డిస్తూ అమ్మగారు, ఏమండి ఏమేస్కుంటారంటే? నేను మొహమాటం వల్ల "ఏమీ అక్కర్లేదండి" అని అన్నాను. ఆయనే పచ్చళ్ళన్నీ చెప్పారు. "నువ్వు వారికి దబ్బకాయ వేయి. రుచి చూసి ఎలా వుందో చెప్తారు" అన్నారు. నేను స్టన్ అయిపోయాను, నా మనస్సులో మాట ఈయనకెలా తెలిసిందా? అని. చాలాసేపు ప్రయాణం చేసి బడలికగా వుంది. మాస్టరు గారు "బాబా దగ్గరే కాస్సేపు పడుకోండి సీతారామయ్యగారూ, ఫ్రెష్ గా, రిలీఫ్ గా వుంటుంది" అన్నారు. కాసేపు అలాగే రెస్ట్ తీసుకున్నాను. అప్పుడు అలసట తీరి బాగా రిలీఫ్ గా వుంది. అంతకు ముందు రెండు, మూడుసార్లు వారిని దర్శించినా అంత సమీపంగా వుండే అవకాశం అప్పుడే కల్గి వారికి మన మనస్సులోని మాట తెలుస్తుందని మొదటిసారిగా గ్రహించగల్గాను. మేము సూళ్ళూరుపేటలో వుండగా ఆ వూరికి వస్తూ పోతూ వుండేవారు. అలా వారు వచ్చినప్పుడు మా యింటికి ఒక స్నేహితుణ్ణి కాఫీకి ఆహ్వానించినట్లు ఆహ్వానించేవాణ్ణి గాని, ఆధ్యాత్మిక విషయాల గురించి మాట్లాడ్డంగాని, వాటిల్లో తలదూర్చడం గాని చేసేవాణ్ణి కాదు. వారు కూడా నన్ను సాయిబాబా బుక్స్ చదవమని ఎప్పుడూ ప్రెస్ చేయలేదు.

ఏవో కొన్ని సమస్యలు వచ్చినప్పుడు సాయిబాబా చరిత్ర చదివితే ఎట్లా వుంటుంది అని మనస్సులో కోరిక కలిగింది. తర్వాత మాస్టరుగారు ఒకసారి వచ్చినప్పుడు "ఏమండీ, సాయిబాబా చరిత్ర చదివి ఎలా వుంటుందో కొంచెం చెప్పండి" అని అన్నారు. అప్పటిదాకా ఆయనెప్పుడూ అలా చెప్పలేదు. వాళ్ళంతట వాళ్ళకి ఆ భావన వచ్చింతర్వాతనే చెప్పేవారే గాని ఆయనకై ఆయన చెప్పేవారు కాదు. కాళ్ళకి నమస్కారం పెట్టమని కూడా ఆయనెప్పుడూ చెప్పలేదు. ఆయన కాళ్ళకి నమస్కారం పెట్టాలని ఎవరికి వారికే బుద్ధిపుట్టి పెట్టేవారేగాని, ఎవరినీ పాద నమస్కారం చేయమని గాని, దక్షిణ ఇవ్వమని గాని నాకు తెల్సినంతవరకూ అడగలేదు. నాకు

వేట, పేకాట యివంటే యిష్టం. ఆధ్యాత్మికత అంటే అస్సలిష్టం లేదు. సాయిబాబా చరిత్ర చదివిన తర్వాత, ఆయన ఏ రూపంలోనైనా వస్తాడు అని చెప్పినందువల్ల, ఓహో! ఆయన ఏ రూపంలోనైనా వచ్చే అవకాశం వుంది గనుక ఈ వేటలో మనకు సంబంధం ఎందుకని మానేశాను. తర్వాత సాయిబాబా ఉపోద్ఘాతం చదివిన తర్వాత ఆ పుస్తకం మొత్తం చదివి 'ఇది చాలా బాగుంది నాక్కూడా ఒక పుస్తకం కావాలి. అయితే దాని కోసం నేను ప్రయత్నించను. దానంతటది అదే రావాలి. నేను డబ్బులివ్వడానికి రెడీ. కానీ దానంతట అదే రావాలి. నేనుగా వెళ్ళి కొనను' అని అనుకొని పారాయణ చేశాను. ఇంతలోకి నాకు సూళ్ళూరుపేట నుండి ఒంగోలుకు ట్రాన్సుఫరైంది. మా పక్కింట్లో బండి నాగరాజుగారనే ఒక మాస్టరుగారుండి "ఏమండీ మీరు బాబా భక్తులు గదా! అందుచేత యిది మా ప్రెజెంటేషన్ క్రింద గుర్తుగా తీస్కోండి" అని సాయిబాబా చరిత్ర ఇచ్చారు. నేను స్టన్ అయ్యాను. ఎప్పుడో ఆయన కొనుక్కున్న పుస్తకాన్ని మాకిస్తారని అనుకోలేదు. అప్పుడే ద్వారకామాయి బాబా పింగాణి విగ్రహం కూడా నా భార్యకు ప్రెజెంట్ చేశారు. అప్పుడు. నాయుడుపేటలో ఏదో ఫంక్షన్ వుంటే మాస్టరుగారొచ్చారు. అప్పుడు నేను, నా మిసెస్, భాస్కరరెడ్డి మేమంతా నాయుడిపేటకొచ్చాం. వస్తూ వస్తూ నా సాయిబాబా చరిత్రని తీసుకొచ్చాను. అక్కడకొచ్చిన తర్వాత మాస్టరు గారుండి "ఏమండీ ఎవరి దగ్గరన్నా సాయిబాబా చరిత్ర వుందా?" అని అడిగారు. 'సార్, నాకు యిలా వచ్చిందండీ సాయిబాబా చరిత్ర' అని అంతా వివరించి బుక్ యిచ్చాను. తర్వాత వారు దాన్లోంచి కొన్ని లీలలు అక్కడున్న వారికి చెప్పారు. ఆ తర్వాత నేను ఒంగోలు వచ్చేశాను.

మాస్టరుగారు ఆయన బాబా మందిరం నిర్మించే రోజులలో స్లాబ్ వెయ్యడానికి నన్ను తరచుగా రమ్మనటం వల్ల వెళ్తుండేవాడిని. ఆయన ఎందుకో నాకా అవకాశం యిచ్చారు. విద్యానగర్ లో సాయిబాబా మందిరం స్లాబ్ వేసే రోజున కూలీలను పెట్టారు. పని మొదలైంది. ఆ రోజు రాత్రి ఆరున్నర ఏడు అయినా పనికాలేదు. కూలీలు ఏదో పేచీ పెట్టుకుని పని ఆపేశారు. స్లాబ్ సగంలో ఆపడానికి లేదు. సరే మాస్టరుగారుండి "ఏం వాళ్ళు చేసే వర్క్ ని మనం చేయలేమా?" అని మాస్టరుగారు పలుగు, పారా తీసుకున్నారు. సరిగ్గా అదే సమయంలో మాస్టర్ గారి దగ్గర చదువుకున్న, చదువుకుంటున్న శిష్యులు చాలామంది అనుకోకుండా బిలబిలమని వచ్చేశారు. అందరూ తలోక బుట్ట, తట్ట పట్టుకునేసరికి కూలి వాళ్ళు కూడా "సరే సార్ చేసేపోతాం, జరిగిందేదో జరిగింది" అన్నారు. వీరు పనిలో బిగేటప్పటికి కారు మేఘాలు కమ్మి తుప్పర ప్రారంభమైనది గాని తెల్లవారు ఝామున 2-50 గం॥కు మాత్రమే కుండపోతగా వర్షం కురిసింది. శ్లాబ్ కంప్లీట్ అయిన తర్వాత నేను కూడా గూడూరులోని మా ఆఫీస్ బంగ్లాకు వెళ్ళిపోయాను. నేను బంగళా చేరిన దగ్గర్నుంచి అంటే రాత్రి 7 గంటల నుండి అర్ధరాత్రి వరకు కుండపోతగా వర్షం కురిసింది. నేననుకున్నా 'పొద్దున్నుంచీ తంటాలు పడి స్లాబ్ వేశామే. ఈ వర్షానికి శ్లాబ్ మొత్తమంతా చెదరిపోతుంది' అని ఎంతగానో బాధపడ్డా. పొద్దునే మాస్టరుగారి దగ్గరకెళ్ళి "సార్ రాత్రి కురిసిన వర్షానికి స్లాబ్ ఎలా వుందోనని తెల్లవార్లూ నాకు నిద్రపట్టలేదు" అని ఎంతో ఆదుర్దాగా అడిగాను. "వర్షం ఇక్కడ అసలేం లేదే" అన్నారు. యాక్చువల్ గా చూస్తే మందిరానికి 1 కి.మీ చుట్టుప్రక్కల ఎక్కడా వానే పడలేదు. అది దాటి చుట్టుప్రక్కల భయంకరంగా వర్షం పడింది. దీనివల్ల మాస్టరుగారు సర్వశక్తిమంతులు అని అర్థమైంది.

21-12-88 వ తారీఖున నా భార్య, "సెలవు జీతం వస్తే డి.డి. తీసుకొని రండి" అని చెప్పింది. ప్రతి నెలా గవర్నమెంట్ జీతాలు వగైరా డబ్బు చాలా తీసుకొని బట్వాడా చేస్తుంటాను. ఇంతవరకు ఎప్పుడూ డి.డి. తీసుకురమ్మని ఆమె చెప్పలేదు. డిసెంబరు 22 వ తారీఖున చేసిన పారాయణలో, బాబా ఒక భక్తునితో, "నీకు డబ్బు ఇచ్చినా అది నీకు దక్కదు" అని చెప్పిన లీల చదివాను. ఆ రోజునే నన్ను విద్యానగర్ కు అర్జెంటుగా రమ్మని ఉత్తరము వచ్చినది. నేను నెల్లూరులో బిల్లు మార్చుకుని ఆ పైకం తీసుకొని విద్యానగర్ కు పోదామనుకున్నాను. ఉదయం పది గంటలకు ఆఫీసు నుండి బయలుదేరినప్పుడు మా అటెండరు, "బ్యాంకు కు వెళుతున్నారు కదా, సంచీ తీసుకొని వెళ్ళండి" అని హెచ్చరించాడు. అతని మాట లక్ష్యపెట్టక వేరొక అటెండరుతో సంచి లేకుండానే బ్యాంకుకు వెళ్ళాను. అక్కడ 9300/- రూపాయలు తీసుకొని ప్యాంటు జేబులో పెట్టుకుని సైకిల్ మీద ఆఫీసుకు వచ్చాను. అప్పుడు సమయం

మధ్యాహ్నం గం॥.1-45 అయినది. ఆఫీసులోకి వచ్చి జేబులో చేయి పెట్టి చూడగానే 5000/- రూ॥లు మాత్రమే వున్నాయి. మిగిలిన 4300/- రూ॥లు పోయినాయి!! సైకిల్ మీద నేను వచ్చిన దారినే వెనుకకు బయలు దేరాను. కొంత దూరము పోయిన తర్వాత ఇద్దరు పోతూ, "రోడ్డు మీద డబ్బులు దొరికినాయట"అని అనుకుంటున్నారు. వాళ్ళని అడిగితే, "మీరు వెనక ఇనుప అంగడి దగ్గరకు వెళ్ళండి. అక్కడ మీకు డబ్బు దొరుకుతుంది" అని అన్నారు. నేను వెంటనే వెనుకడు వచ్చి ఆ అంగడి అతనిని అడిగితే, రెండు వేల రూపాయలు నోట్ల కట్ట ఇచ్చి, "మిగిలిన డబ్బు ముందు వున్న టీ కొట్టు దగ్గర వుంది. తీసుకోండి" అన్నాడు. నేను టీ కొట్టు వద్దకు వచ్చి అడిగితే వాళ్ళు నాకు 300/- రూపాయలు ఇచ్చి, "అంత అజాగ్రత్తగా వుంటే ఎలా? అని హితబోధ చేశారు. నేను ఇంకా 2000/- వుండాలి అంటే, అప్పుడు ఒక చిన్నపిల్లవాడు వచ్చి, "అక్కడకు ఇంకొంచెం దూరంలో డబ్బు కట్ట పడిపోయిన దాన్ని ఎవరో నల్ల ప్యాంటు తొడుక్కున్న కుర్రవాడు తీసుకొని పారిపోయాడు" అని చెప్పాడు. ఎంతసేపు అక్కడ విచారించినా అలాంటి వారు కనిపించలేదు. నేను ఇంక ఆఫీసుకి తిరిగి వచ్చాను. అప్పటికి నా మనస్సులోని ఆరాటం కూడా చాలా భాగం తగ్గింది.

తర్వాత నెమ్మదిగా ఆలోచిస్తుంటే పైన జరిగిన అన్ని సంఘటనలు గుర్తుకు వచ్చాయి. బాబా ఎన్ని విధాలుగా మనకు సహాయము చేద్దామనుకున్నా మన యొక్క కర్మ దానికి అడ్డుపడుతుంది. పైన చెప్పిన వారి సలహాలలో ఏది పాటించినా ఆ రోజు ఆ విధముగా జరిగేది కాదు. అంతే కాకుండా బాబాగారి దయ వల్ల మాత్రమే 2300/- రూ॥లు అయినా దొరికాయి. ఈ రోజులలో రోడ్డు మీద పారేసుకున్న డబ్బు కొంతైనా దొరికింది. అంటే అది సాయిబాబా కృప కాక మరేమిటి? ఇది ఒక చిన్న ఉదాహరణ. మాత్రమే!

ఇవన్నీ నాకు మాస్టరుగారి లీలలన్పిస్తాయి. సాయిబాబా సంపర్కంలోకి, మాస్టరుగారి సంపర్కంలోకి వచ్చిన తర్వాత నాలో చాలా మార్పు వచ్చింది. అంతకు ముందు విపరీతమైన మానసిక వత్తిడిలు వుండేవి. కోపం వుండేది, అసంతృప్తి వుండేది. బాబా దగ్గర కొచ్చిన తర్వాత అన్నీ బాబానే చూస్కుంటారు. మాస్టరుగారు చూస్కుంటారు అనేటటువంటి ధైర్యం, సరైన ఆలోచనా విధానం వచ్చింది, సాత్వికత అలవాటయ్యింది. అంతకు ముందు వేట నా హాబీ. బాబా మార్గంలో కొచ్చిన తర్వాత ఎందుకీ హింసా కార్యక్రమం చేయటం, జంతువులని చంపటం, మనవాళ్ళని కూడా మానసికంగా బాధ పెట్టడం ఎందుకు. అదీగాక నోరులేని జీవాల్ని చంపినందువల్ల ముందు జన్మకి పాపాలు మూటగట్టుకోవటం అన్న ఆలోచన వచ్చింది. మనం కూడా కొంతవరకు మారితే బాగుంటుందనిపించింది. మాస్టరుగారు చెప్పే విషయాలు వింటున్నప్పుడు చాలా ఆనందంగా వుండేది. నా జీవిత విధానం మార్చుకున్న తర్వాత జీవితంలో చాలా శాంతి, సుఖం, తృప్తి, ఆనందం పొందగల్గుతున్నాను. 'గత జీవిత విధానం కంటే యిప్పుడే బాగుంది' అని అనిపిస్తున్నది.

మా చిన్నబ్బాయి అప్పుడు కొల్హాపూర్ లో వుద్యోగం చేస్తున్నాడు. లోకల్, నాన్-లోకల్ అన్న భావన, పక్షపాతం అక్కడి వారికి బాగా వుండేది. ప్రతిదానికి నాన్-లోకల్ వాళ్ళని హెరాస్ చేసేవారు. పని చెప్పేవారు కాదు. వూరికినే కూర్చోపెట్టి మాటలలో నానా విధాలుగా బాధలు పెడ్తుంటే వీడు మాస్టరుగారి ఫొటో దగ్గరకెళ్ళి "మాస్టరుగారు ఇన్ని రోజులుగా వీళ్ళు నన్నెంతగానో బాధ పెడుతూనే వున్నారు. రేపు ఒక్కరోజు చూస్తా. రేపటిరోజున వారిలో గాని మార్పు రాకపోతే నేను ఈ వుద్యోగానికి రాజీనామా చేసి వెళ్ళిపోతాను. మీరే ఆ విషయం చూసుకోవాలి" అని బాధపడ్డాడు. ఆ మర్నాడు వీడు ఆఫీస్ కెళ్ళే సరికి "హాయ్ రమేష్ ఏంటి ఎట్లా వున్నావు" అని మాట్లాడ్తూ వుంటే వీడు స్టన్ అయిపోయాట్ట. 'నిన్నటిదాకా నన్ను నానా బాధలు పెట్టిన వాళ్ళలో ఇవాళ యింత అకస్మాత్తుగా మార్పు వచ్చిందే!' అని ఆశ్చర్యపోయాడు. అక్కడే తన సర్వీస్ కొనసాగించాడు. అక్కడ టర్మ్ అయిపోయిన తర్వాత ఒంగోలు కొచ్చేశాడు. అప్పుడు మాస్టరుగారి దగ్గరకొచ్చి నమస్కారం పెట్టుకోగానే "ఏరా? నీ ఆఫీస్ విషయాలన్నీ సెటిల్ అయిపోయాయా? అని చిరునవ్వుతో మాస్టరుగారు అడుగుతుంటే వాడు ఎంతగానో ఆశ్చర్యపోయాడు. తర్వాత వాడు వాళ్ళమ్మకి చెప్పాడు "ఇట్లాగైందే. నేను మాస్టరుగారి ఫొటోకి దణ్ణం పెట్టుకున్న మర్నాడే వాళ్ళలో అంత మార్పు వచ్చిందే వాళ్ళలో అంత

*మిగతా 29వ పేజీలో*

(గత సంచిక తరువాయి)

# మరికొందరు భక్తులు

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## బాలా భావూ

అంధేరీకి చెందిన బాలభావూ మొదట కల్యాణ్‌లో దాసగణు మహరాజ్ కీర్తనలవలన బాబా గురించి విన్నాడు. తర్వాత బాంద్రాకు చెందిన అమీర్ షక్కర్ గూడా బాబా గురించి ఎంతో గొప్పగా చెప్పి అతనిని బాబా దర్శనం చేసుకోమన్నాడు. అపుడతడు శ్రీకృష్ణపాటిల్ తో కలిసి, 1908లో శిరిడీ వెళ్ళాడు. అతడు తన అనుభవాలనిలా చెప్పాడు; "అప్పట్లో సాఠేవాడా ఒక్కటే శిరిడీలోనున్న వసతిగృహం. కాని మేము గణపతి ఆలయంలో బసచేసాము. ఆరోజు బొంబాయి నుండి జనమెవ్వరూ రాలేదుగాని, ఆ గ్రామానికి చెందినవారు, పరిసరాలవారూ ఎంతోమంది వచ్చారు. నేను మొదట అక్కల్కోట వెళ్ళదలచాను గాని, ఆ దారిలోనే శిరిడీ వున్నదనీ, దానిని దర్శించుకున్నాక అక్కల్కోట వెళ్ళవచ్చుననీ అమీర్ షక్కర్ చెప్పాడు. కనుక నేను కేవలం బాబా దర్శనం మాత్రం చేసుకుని అక్కల్ కోటకు బయల్దేరి వెళ్ళిపోవాలనుకున్నాము. కాని మేము బాబాను దర్శించగానే ఆయన, 'నేను అక్కల్కోట వెళ్ళితీరాలి' అన్నారు. నా మనోభావాన్ని గుర్తించగల వారి శక్తిచూచి ఆశ్చర్యపోయి, ఆ రోజంతా వారి సన్నిధిలోనే గడపాలని నిశ్చయించుకున్నాము. ఒక మహాత్ముని సన్నిధిలో వున్న సంతోషం పొందాలన్నదే నేను కోరినది. ఆ మరురోజు వారి అనుమతితో అక్కల్కోట వెళ్ళాను. వారిచేత ఆకర్షించబడ్డాను గనుక అటు తర్వాత దీపావళికి మరల శిరిడీ వెళ్ళాను. ఆ సమయంలో బాబా సన్నిధిలో బొంబాయి నుండి వచ్చిన జనమున్నారు. నావెంట అయిదారుగురు వచ్చారు. నాడు సాయంత్రం 8 గం||ల నుండి అర్ధరాత్రివరకూ బాబాతోనే మశీదులోనే వున్నాక, నాకుపదేశమిచ్చి నన్ను శిష్యునిగా చేసుకొమ్మని వారి నడిగాను. బాబా, "మనకు గురూపదేశంపొంది తీరాలన్న నియమమేమీ లేదు, అంతా మనలోనే వున్నది. నీవెలాటిది నాటుతావో, అలాంటిదే పొందుతావు; ఏమిస్తావో అదే నీకు లభిస్తుంది. అంతా నీలోనే వున్నది. అంతర్వాణి చెప్పినట్లు విని, అది ఆదేశించినట్లే నడచుకో! మనను మనమే చూచుకోవాలి. అదే గురువు" అన్నారు. నేను బాబాను ఉపదేశం కోరినపుడూ, యిప్పుడూ గూడ రత్నగిరిలో నాకు మా సాంప్రదాయ గురువున్నారు.

బాబాపై విశ్వాసం పెరిగిన కొద్దీ నేను పండరీపురము, అక్కల్కోట వెళ్ళడం తగ్గించాను. నేను స్థానిక పాఠశాలలో అసిస్టెంటు మాస్టరుగా పనిచేస్తూనే స్టాంపులుగూడ అమ్మేవాణ్ణి. నేను శిరిడీ వెళ్తూండడం వలన నా స్కూలు పని దెబ్బతింటూండేది. నా సెలవలు అయిపోయాక గూడ బాబా నన్ను శిరిడీలోనే నిలిపి వేస్తుండేవారు. మా స్కూలు అధికారులు నేనాసమయములో ఎక్కడున్నానో విచారించి నన్ను ఎగతాళి చేస్తుండేవారు. నేను స్కూలుపనో, లేక శిరిడీనో ఏదో ఒక్కదానిని ఎన్నుకోవలసి వచ్చేసరికి, నేను స్కూలు పనినే విడిచి పెట్టాను. కొంతకాలం స్టాంపులే అమ్ముతూ వుండి, తర్వాత ఆ వృత్తి మా అబ్బాయికిచ్చాను. నాకప్పుడు నెలకు ₹20/-లు లేక ₹25/- లు వచ్చేవి. నేను ఉద్యోగం విడిచేటప్పటికి నాకు 32సం||లు. అయినా విశ్వాసం వహించి ప్రతి శ్రీరామనవమికీ శిరిడీ వెళ్తున్నాను. తర్వాతొకప్పుడు మా పొరుగూరులో భయంకరమైన దోపిడీ జరిగింది. దొంగల చేతిలో తీవ్రంగా గాయపడిన ఆ యింటివారిని ఆస్పత్రిలో చూచానుగూడ. మా కుటుంబాన్ని అట్టి ఆపదనుండి రక్షించమని బాబాను ప్రార్థించాను. నాటిరాత్రి బాబా నాకు కలలో కనబడి, తాము పదిమంది పఠానులను తీసుకునివచ్చామని, నేను భయపడనవసరంలేదనీ చెప్పారు. అదేసమయంలో

కొందరు చాకలివాళ్ళు తాము మామూలుగా గుడ్డలు వుతుక్కునేచోటుకు తమను రైల్వేశాఖాధికారులు రానివ్వడం లేదని చెప్పి, మాస్థలంలో గుడిసెలు వేసుకోనిమ్మని కోరారు. నేను వెంటనే వప్పుకున్నాను. నాకు నెలకు ₹200/-లు అద్దె లభించడమేగాక, వారి తోడుగూడ లభించింది. అపుడున్న మా బావిలో నీరు వాళ్ళకు చాలకపోయేసరికి బాబాతో సంప్రదించి క్రొత్తబావి త్రవ్వించాను. అందులో నీళ్ళు పుష్కలంగా పడ్డాయి.... తర్వాత స్వయంగా నేను శిరిడీ వెళ్ళి బాబా అనుమతి పొంది యిల్లు కట్టనారంభించాను. అపుడు నావద్ద 5 గదులు కట్టడానికి మాత్రమే డబ్బున్నది. కాని బాబా నేల మీద 25 గీతలు గీచి, 'గదికొక రూపాయి చొప్పున ₹25/-లు యివ్వు' అన్నారు. నేను పని ప్రారంభించాక, క్రమంగా 1920 నాటికి 25 గదులు కట్టుకోగలిగాను.

## ఇమాంభాయ్ చోటేఖాన్

ఇమాంభాయ్ చోటేఖాన్ ఔరంగాబాద్ జిల్లాలోని 'వాజాపూర్' లో నివసిస్తుండేవాడు. అతడు పోలీసు కానిస్టేబుల్ గా పనిచేస్తూ, అవకాశమున్నప్పుడు ఫకీరు దర్వేష్ షా అనే ముస్లిం మహాత్ముని దర్శిస్తుండేవాడు. ఒకప్పుడతడు తాను పరిశోధిస్తున్న నేరం గురించిన వివరాలు తెల్పనందుకు క్రైస్తవుడైన ఒక టీచరును తీవ్రంగా కొట్టాడు. ఆ టీచరు నోటివెంట రక్తంపడి స్పృహ లేకుండా పడిపోయాడు. చోటేఖాన్ తన వుద్యోగానికి రాజీనామా చేసి పారిపోతే తప్ప అతడికి శిక్ష తప్పదని మమల్తదార్ చెప్పగా, అతడు వుద్యోగం విడిచిపెట్టి నిజాం రాష్ట్రం నుండి పారిపోయాడు. అయినా తనను యే క్షణాన్నైనా పట్టుకొని నిజాం ప్రభుత్వం శిక్షించవచ్చన్న భయంతో అతడు దర్వేష్ షా గారిని ఆశ్రయించాడు. ఆయన అతనిని శిరిడీలో శ్రీసాయిని దర్శించమని చెప్పాడు. పిచ్చివానిలాకన్పించే సాయి నిజానికి గొప్ప 'ఔలియా' (సిద్ధపురుషుడు) ఔనో కాదో తెలుసుకోడానికి అవసరమైన పరీక్ష అతనికి తెల్పాడు. ఇతనికి బాబాతో కల అనుభవాలన్నీ 'శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర' లో వ్రాశాను. ఇతడు బాబా గురించి కొన్ని ఆసక్తికరమైన వివరాలు యిలా చెప్పాడు:

"బాబాకు అరబ్బీ, ఉర్దూభాషలుగూడ వచ్చు. అబ్దుల్ కు ఖురాన్ చదవడం ఆయనే నేర్పారు. ఒకసారి బాబా వద్దకు నూరుద్దీన్ అను సైనికుడొకడు వచ్చి దర్శించి, తిరిగి వెళ్ళడానికి అనుమతి కోరాడు. బాబా అనుమతించక, 'రేపు వెళ్ళు!' అన్నారు. కాని అతడు సైన్యంతో కలసి తప్పక ముందుకు సాగిపోవలసివున్నది. అప్పుడు బాబా అతనికి అయిష్టంగానే ఊదీయిచ్చి ఉర్దూలో కొద్దిమాటలు చెప్పారు. వాటి అర్థం, 'గొయ్యి త్రవ్వు, ఊదీ తిను' అని. అతడు ఊదీ తీసుకొని తన గుఱ్ఱం మీద వెళ్ళిపోయాడు. దారిలో కోపర్గాం దగ్గర సమాధి చేయడానికి తీసుకుపోబడుతున్న ఒక శవం అతనికి ఎదురైంది. అతడు తన గమ్యం చేరినప్పటినుండీ అతడి మనసులో ఆ శవమే తరచుగా కన్పిస్తుండేది. అది కన్పించినప్పుడల్లా అతడికి మంచి భోజనం లభించి సుఖం కల్గేది. మిగిలిన రోజులలో అతడెంత ప్రయత్నించినా భోజనంగూడ లభించేదిగాదు, చివరికి అతడు మనసులో క్రుంగిపోయి ఉద్యోగం విడిచిపెట్టాడు. ఈ చిత్రమైన అనుభూతికి కారకులు బాబా అని తలచి అతడు శిరిడీ చేరి 6 మాసాలు వున్నాడు. అంతటితో ఆ పీడ తొలగిపోయింది. ఈసారి బాబావద్ద సెలవు తీసుకొని అతను వెళ్ళిపోయాడు. అటు తర్వాత అతడు దేవలాలి లో అంగడి పెట్టుకొని సుఖంగా జీవనం చేసాడు.

మసీదు ముంగిట మండపం నిర్మించేవరకూ బాబా సన్నిధిలో ప్రతిరోజూ పగలు తబలా, సారంగి మొ॥న వాయిద్యాలతో 'మౌలు', 'కవ్వాలి' నిర్వహిస్తుండేవారు. మండపంలో వీటికి ఏర్పాట్లు చేయించి అందుకయిన ఖర్చు బాబాయే భరించేవారు. మండపం నిర్మించాక యిది ఆపివేసారు. ముస్లిం భక్తులు నివేదనలు అర్పించినప్పుడు ఒక్కొక్కప్పుడు బాబాయే ఫాతిహా' చదివేవారు; మరొకప్పుడు ఎవరిచేతనైనా చదివించేవారు. ముస్లిం పండగలప్పుడు 'ఈద్ గా' దగ్గర ప్రార్థనలు చేసుకున్న ముస్లింలు మశీదుకు వచ్చి బాబాకు సలాము చేసేవారు. అరుదుగా మసీదులో ధునివద్ద నిలబడి బాబా నమాజు చేసేవారుగాని, అందరు ముస్లింల వలె అందుకు తగిన శారీరక క్రియలు చేసేవారుగాదు. అటువంటప్పుడు ఆయన నమాజు చేస్తూనే ధుని ప్రజ్వలింప జేసేవారు.

బాబావద్ద అబ్దుల్ ఖాదర్, షేక్ అబ్దుల్లా, అన్వర్ ఖాన్, మహమ్మద్ ఖాన్ వంటి ముస్లింలు కొందరు ఆత్మవికాసం పొందారు. అన్వర్ ఖాన్, మద్దూషా వంటి ముస్లింలు తాము తలపెట్టిన ధర్మకార్యాలకు కావలసిన నిధులు బాబా ఆశీస్సులతో పొందగల్గారు.

***మిగతా 29వ పేజీలో***

# ద్వారకామాయి అనుభవమండపము

*తీగల శ్రీకాంత్, ఒంగోలు*

నా చిన్నప్పుడు అందరి ఇళ్ళల్లోలాగే మా ఇంట్లో కూడా సంప్రదాయంగా జరిగే పూజలు అవీ చేసుకునేవాళ్ళము. నేను కూడా అమ్మతో గుడికి వెడుతూ ఉండేవాడిని. అయితే నేను 7 వ తరగతి చదివే వయస్సు వచ్చేసరికి నా ఆలోచన ధోరణి వేరేగా ఉండేది. దేవుడనే వాడుంటే కొందరు కష్టాలు పడటం, కొందరు బాగుండటం ఇలా అసమానతలు ఎందుకు వున్నాయి? ఈ విధమైన ఆలోచనలు వచ్చేవి. పైగా ఋజువు ఉంటేనే గానీ ఏదీ నమ్మేవాడిని కాదు. ఇంట్లో వాళ్ళది ఒకరకం పంథా అయితే, నాది ఇంకొకరకంగా ఉండేది. ఒంగోలు లో శ్రీగిరి అని కొండపైన వేంకటేశ్వరస్వామి కోవెల వుంది. నేను ఇంటర్ చదివే రోజుల్లో ఒక సందర్భంలో అక్కడకి రోజూ వెళ్లి బైట ఖాళీ ప్రదేశంలో కూర్చునేవాడిని. కానీ గుళ్ళోకి వెళ్ళేవాడిని కాదు. నాకు అలా ఏకాంతంగా కూర్చోవడం చాలా ఇష్టం. తరవాత కొన్నిరోజులకి మా స్నేహితులు ఎవరో చెబితే లాయరుపేటలో బాబా గుడికి వెళ్లి, అక్కడ దత్తాత్రేయ మందిరం ఎదురుగా కూర్చునేవాడిని. అక్కడ ఏకాంతంగా ఉండేది. బాబా గుళ్ళోకి వెళ్ళేవాడిని కాదు. అసలు మాస్టరుగారి గురించి సరైన అవగాహనే ఉండేదికాదు. పైగా నాకు బాబా రూపం అంటే నచ్చేదికాదు. ముసలాయన, అందంగా వుండరు,,,,,అదీ నా భావన. రాముడు కృష్ణుడు చాలా బాగుంటారు, ఈయన ఇలా వున్నారేమిటి అనిపించేది. నాకు అప్పుడు ఆంజనేయస్వామి ఇష్టదైవం. ఆయన పరాక్రమం చాలా బాగా నచ్చేది. అందువల్ల ఆంజనేయస్వామి మాల వేసుకునేవాడిని. అలా మాల వేసుకున్నప్పుడు ఒక చిత్రమైన సంఘటన జరిగింది.

నేను అయ్యప్పస్వామిగుడి దగ్గర వున్న టిఫిన్ సెంటర్ లో టిఫిన్ తిని కాలేజీకి బయలుదేరుతున్నాను. అప్పుడే ఒకాయన నా పక్కనుండి వెడుతూ అందరినీ బండి ఎక్కించుకొమ్మని అడుగుతున్నారు. ఎవ్వరూ బండి ఆపడం లేదు. ఆయన ఒకపెద్ద సంచి తలకి తగిలించుకుని బాగా మురికి బట్టలతో వున్నారు. నాకు చాల జాలేసి, ఎక్కడకి తీసుకెళ్లాలని అడిగాను, 'బైపాస్' అన్నారు. సరే కూర్చోమన్నాను. ఆయన బండి మీద కూర్చుని నెమ్మదిగా వేదం చదవడం మొదలు పెట్టారు. చదువుతూ ఊదీ తీసుకుని నా గుండెలకి, పక్కలకీ అంతా రాస్తున్నారు. శిరిడీలో ప్రసాదం లాంటిది అంటే నువ్వులుండల్లాంటివి నా నోట్లోపెట్టారు. నా దృష్టంతా ఆ రోజు నేను రాయబోయే పరీక్ష మీద వుంది., బైపాస్ దగ్గరకి రాగానే 'కొంచెం ముందుకి' అన్నారు. ముందు బాబా గుడి వచ్చింది, 'ఇక్కడ ఆపేయ్' అన్నారు. ఆయన్ని అక్కడ దింపేసి తొందరగా వెళ్ళిపోయాను. తరవాత సాయంత్రం ఆయన చేసినవన్నీ గుర్తుకొచ్చి, ఆయన్ని వదిలిపెట్టిన బాబా గుడికి వెళ్లి అక్కడివాళ్ళని ఆయన గురించి అడిగితే, ప్రొద్దుటినించి అలాంటి వాళ్ళెవ్వరూ రాలేదని చెప్పారు.

ఒకసారి మా స్నేహితుడు ఇల్లు మారుతూంటే సహాయం చెయ్యడానికి వెళ్లాను. పుస్తకాలు సర్దుతూంటే 'శ్రీ సాయి లీలామృతము' గ్రంథం మధ్యలో వున్న కొన్ని పేజీలు కనిపించాయి. నాకు పుస్తకాలు చదివే అలవాటు ఉండేది. అలాగే యదాలాపంగా చదివాను. నాకు చాలా బాగా నచ్చింది. చాలా సరళమైన

భాషలో అందరికి అర్థమయ్యేలా రాశారనిపించింది. బాబా చరిత్ర అని అర్థమయ్యింది, అట్ట లేకపోవడం వల్ల ఎవరు రాసారో తెలియలేదు. తరవాత కొన్నాళ్ళకి నాకు తెలిసిన ఆంటీ ఒకరు, శ్రీ సాయి లీలామృతము గ్రంథము ఇచ్చి ఒకసారి చదువు అన్నారు. ఆవిడమీద గౌరవంతో ఆ గ్రంథం తీసుకున్నాను. ఆ గ్రంథం చదువుతున్న కొద్దీ లోపల హాయిగా శాంతిగా ఉండేది. రెండవసారి చాలా శ్రద్ధగా చేసాను.

నేను BBM గ్రూప్ లో డిగ్రీ లో చేరాను. చివరి సంవత్సరం పరీక్షల సమయానికి బిజినెస్ లా పేపర్ సరిగ్గా చదవలేదు. పరిక్ష తప్పడం ఖాయం అనిపించింది. చాలా భయమేసింది. మరునాడు పరీక్ష అనగా, మొట్టమొదటిసారి బాబాగుడిలోకెళ్ళి, ఆయన ఎదురుగా మోకాళ్ళమీద నిల్చుని, రెండు చేతులూ జోడించి, ''బాబా రేపు నేను రాయబోయే పరీక్షకి సరిగ్గా సిద్ధంకాలేదు, నన్ను రక్షించు" అని దణ్ణం పెట్టుకున్నాను. మర్నాడు ప్రశ్నాపత్రం చూడగానే అన్నీ నేను చదివినవే వచ్చాయి. పైగా లోపలనించి సమాధానాలు ఒకదాని తరవాత ఒకటి బాగా జ్ఞాపకానికి వచ్చి పరీక్ష బాగా రాసాను. మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాను. అప్పుడిక బాబా మీద నమ్మకం కుదిరింది. శ్రీ సాయి లీలామృతము పారాయణ చేసేవాడిని.

ఒకసారి బాబా గుడిమీదుగా ఎటో వెడుతూంటే, సరిగ్గా గుడి ముందు బండి ఆగిపోయింది. లోపల చాలా జనం వున్నారు. ఆ రోజు గురుపూర్ణిమ. నేను కూడా గుళ్ళోకి వెళ్లి బాబా దర్శనం చేసుకున్నాను. బైటికి వస్తుంటే ఒక పెద్దావిడ "బాబూ! గురుచరిత్ర చదువుతావా" అని అడిగారు. నా దగ్గర గ్రంథం లేదని చెప్పి తప్పించుకోవాలనుకున్నాను. నా దగ్గరుంది చదవమని ఆవిడ నాకు గురుచరిత్ర గ్రంథం ఇచ్చారు. ఆ రోజు గుళ్లో' గురుచరిత్ర పారాయణ జరుగుతూంటే అక్కడికెళ్లి కూర్చుని అక్కడి వారితోపాటు కొంత గ్రంథం నేనూ చదివాను. ఆ గ్రంథం కూడా నాకు బాగా నచ్చింది. తరవాత ఆ గ్రంథాన్ని మొదటిసారి చాలా శ్రద్ధగా బాబా గుడిలో ధుని దగ్గర కూర్చుని చదివాను. గ్రంథం పూర్తయ్యాక, మొత్తం నేను చూస్తున్నదంతా ఆయనే అనిపించింది. అపారమైన శాంతి అనుభవం అయ్యింది. ఆ అనుభవం మూడు రోజులు నిలిచింది. ఇక అప్పటినించి ఒకసారి శ్రీ సాయి లీలామృతము, ఒకసారి శ్రీ గురుచరిత్ర పారాయణ చేసేవాడిని. అలా కొన్నిసార్లు చెయ్యగానే బాబా నాకు ఒక అద్భుతం చేశారు.

ఒకరోజు మధ్యాహ్నం భోజనం చేసి పడుకున్నాను. ఒక స్వప్నం వచ్చింది. నేను ఒక శివాలయానికి వెళ్లాను. అక్కడ గర్భగుడిలో శివలింగం స్థానంలో బాబా కాలుమీద కాలు వేసుకుని కూర్చుని వున్నారు. ఎంత అందంగా వున్నారో చెప్పలేను. నేను ఇన్నాళ్లూ 'ముసలాయన, అందంగా వుండరు' అనుకునేవాడిని. అటువంటిది ఇప్పుడు నేను వర్ణించలేనంత అందంగా స్వప్నంలో దర్శనమిచ్చారు. మామిడిపండు రంగు శరీరం, గులాబీ రంగు చెక్కిళ్ళు, ఆయన నములుతున్న కిళ్ళీనించి యెర్రని రసం బయటకు కారుతోంది. ఎర్రటి పెదవులతో కాషాయరంగు వస్త్రాలు కట్టుకుని, విపరీతమైన కాంతులు వెదజల్లుతున్నారు. ఆనందభాష్పాలు కారుతుంటే ఆయన రూపాన్ని అలా మైమరచి చూస్తున్నాను. బాబా, 'ఎందుకురా ఏడుస్తావ్, అని నా చేతిలో శ్రీ సాయి లీలామృతము గ్రంథం వేశారు. నేను బైట నందికి పక్కన అంటే బాబాకి కుడివైపు గడప ఇవతల నిలబడి వున్నాను. నందికి అటుపక్కన పూజ్యశ్రీ మాస్టరుగారున్నారు, వారు నా వైపు చూడటంలేదు వారి గురువుగారిని చూస్తున్నారు. బాబా నాకు వారిని చూపించి "ఈయన నీ గురువురా" అన్నారు. ఒకపక్క పూజ్యశ్రీ మాస్టరుగారు రాసిన గ్రంథాలన్నీ వున్నాయి. 'ఈ గ్రంథాలన్నీ నువ్వు చదవాలిరా' అని చెప్పారు. స్వప్నం అంతమయ్యింది. ఆవిధంగా బాబా నా గురుదేవుని నాకు అనుగ్రహించారు.

తరవాత నేను పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలన్నీ చదివాను. మా అమ్మ కూడా శ్రీ సాయి లీలామృతము పారాయణ చేసేవారు. ఇంట్లో అమ్మ నేను ఎక్కువగా బాబా గురించి, మాస్టరు గారి గురించి చర్చలు చేసుకునేవాళ్లం. క్రమంగా ఇంట్లో సత్సంగాలు చెయ్యడం మొదలుపెట్టాము. ఇలా జరుగుతూండగా నాలుగేళ్ళ క్రితం మా అమ్మగారు దివంగతులయ్యారు. ఆమెకు సద్గతి కలగాలని, ఒకొక్కనెల ఒకొక్క మహాత్ముని దగ్గర కార్యక్రమాలు చేసేవాడిని. చివరగా శిరిడీలో 11 రోజులుండి చివరిరోజు అమ్మకి చెయ్యాల్సిన కార్యక్రమం చేసి, బాబావద్ద అమ్మకి సద్గతి కలగాలని మనస్ఫూరిగా నమస్కారం చేసుకున్నాను. మర్నాడు నేను బయలుదేరి ఒంగోలు వచ్చేసే

*మిగతా 29వ పేజీలో*

# ఆచార్యుని అద్భుత లీలలు

***శ్రీమతి సుభాషిణి, బాపట్ల***

పూజ్య గురుదేవులు శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారి లీలావైభవాన్ని బాపట్ల వాస్తవ్యులు శ్రీమతి సుభాషిణిగారు ఈ విధంగా తెలియచేస్తున్నారు.

నాకు ఇంటర్మీడియట్ చదువు అవ్వగానే మా మేనబావ తో పెళ్లయ్యింది. వాళ్ళది బాపట్ల. చాలా పెద్ద కుటుంబం. అత్తయ్య, మావయ్య, ఆరుగురు మరుదులు. అందరం కలిసే వుండేవాళ్ళం. మా వీధిలోనే బాబాగుడి, బాపట్లలో పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి ప్రచారం చేస్తూ సత్సంగాలు నిర్వహిస్తూన్న కోటేశ్వరరావు అంకుల్ గారి ఇల్లు వున్నాయి.

నాకు మొదట బాబు, మరుసటి సంవత్సరం పాప పుట్టారు. ఆ సమయంలో మా అమ్మకి తెలిసిన వాళ్ళు, సచ్చరిత్ర చదవమని నాకు పంపించారు. గర్భవతిగా వున్నపుడు పారాయణ చేసాను. కోటేశ్వరరావు అంకుల్ వాళ్ళ ఇంటినించి భజనలు వినిపించేవి కానీ, వెళ్ళడానికి కుదిరేది కాదు. ఎప్పుడైనా తీరిక దొరికితే భజనకి వెళ్ళేవాళ్ళం. అప్పుడు కోటేశ్వరరావు అంకుల్ శ్రీ సాయిలీలామృతం పారాయణ చెయ్యమని చెప్పేవారు. నాకు, మావారికి గ్రంథాలు ఇచ్చారు. నేను ఒక నెల పూర్తయ్యే సరికి 14 వ అధ్యాయం వరకు మాత్రమే పారాయణ చేయగలిగాను. కానీ మావారు ఆయన చేసే ఉద్యోగం స్థిరపడాలన్న సంకల్పంతో నెలరోజులకి పూర్తిచేశారు. ఈయన బాపట్ల కళాశాలలో తాత్కాలిక సేవలలో పనిచేసేవారు. తరవాత జూనియర్ అసిస్టెంట్ గా ప్రమోషన్ ఇచ్చి శాశ్వత ఉపాధి కల్పించారు. ఈ రోజు మేమంతా కడుపునిండా భోజనం చేస్తున్నామంటే, దానికి కారణం పూజ్యశ్రీ మాస్టరుగారి శ్రీ సాయిలీలామృతం.

మా అత్తయ్య, మావయ్య మమ్మల్ని సత్సంగానికి వెళ్ళమని బాగా ప్రోత్సహించేవారు. ఒకసారి నాకు స్వప్నము, మెలకువగా కాని స్థితిలో పూజ్యశ్రీ మాస్టరుగారు శూన్యంలో కూర్చుని కనిపించారు. నేను ఆయన పాదాల దగ్గర కూర్చుని గరుడవర్ధనం పువ్వులతో పూజ చేస్తున్నాను. కొంతసేపయ్యాక పూజ్యశ్రీ మాస్టరుగారు తమ కాలి బొటన వేలు, దాని పక్కవేలుతో ఒక గరుడవర్ధనం పువ్వు తీసుకుని, దాన్ని నాకు ఇచ్చారు. అది మొట్టమొదట పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు ఇచ్చిన ప్రసాదం.

నేను ప్రతిరోజూ కాకడ హారతికి బాబాగుడికి వెళ్లేదాన్ని. ఒకరోజు నేను నిద్ర లేవలేదు. అప్పుడు నాకొక స్వప్నం వచ్చింది. మా గదితలుపు ఎవరో కొడుతున్నారు. నిద్రలోనే వెళ్లి తలుపు తీసాను. ఎదురుగా పూజ్యశ్రీ మాస్టరుగారు! లోపలకి ఆహ్వానించాను. అది చాలా చిన్న గది కనుక, రెండు మంచాలు, టీ.వి కి ఒక టేబుల్ పెట్టుకున్నాము. ఒక మనిషి నడవడానికి సన్నటి స్థలం ఉంటుంది. పూజ్యశ్రీ మాస్టరు గారు పిల్లలు పడుకునే మంచం మీద కూర్చుని, "టి.వి పెట్టమ్మా" అన్నారు. ఏం పెట్టనండి అంటే, క్రికెట్ పెట్టమ్మా అన్నారు. నేను క్రికెట్ పెట్టి ఆయన పక్కనే నిల్చుని మనసులో, అయ్యో హారతికి సమయం అవుతోంది, మాస్టరుగారిని వదిలి ఎలా వెళ్ళాలి అనుకుంటున్నాను. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు "నువ్వు హారతికి వెళ్ళమ్మా. నువ్వు వచ్చేదాకా నేనిక్కడే వుంటాను" అన్నారు. వెంటనే మెలుకువ వచ్చింది. గుళ్లో హారతి

మొదలవుతోంది. గబగబా తయారై గుడికి వెళ్లాను. అలా ప్రతి క్షణం మమ్మల్ని కనిపెట్టుకుని కంటికి రెప్పలా చూసుకుంటున్న పూజ్యశ్రీ మాస్టరు గారికి సహస్ర వందనాలు.

నాకు శిరిడికి వెళ్లడమంటే చాలా గొప్పగా అనిపించేది. అంటే నేను వెళ్ళలేనేమో అంత గొప్ప ప్రదేశానికి అనిపించేది. ఒక 10 సంవత్సరాల క్రితం కోటేశ్వరరావు అంకుల్ శిరిడి యాత్ర వేశారు. మేము కూడా అందులో పాల్గొన్నాము. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసుకుని, "మాస్టరుగారు, మీరు ఎందరినో యాత్రలకి తీసుకెళ్లారు. అదేవిధంగా మమ్మలిని కూడా మీరే దగ్గరుండి తీసుకెళ్ళాలి" అని చెప్పుకున్నాను. మేమందరము రైలుకి రిజర్వేషన్ చేయించుకున్నాము. నాకు బోగీలో మధ్య బెర్త్ వచ్చింది. నేను పడుకున్న బెర్త్ నించి, మా బోగీ ప్రవేశ ద్వారము నాకు కనపడుతూ వుంది. రైలులో అందరూ నిద్రపోయారు. నాకు అదే మొదటిసారి రైలు ప్రయాణం. అందుకని నిద్ర పట్టలేదు. ఒక్కసారిగా సిగరెట్ వాసన చాలా ఎక్కువగా వచ్చింది. ఎవరో మగవారు ఈ బోగీ లోకి ఎక్కి ఉంటారని కళ్లుతెరిచి చూసాను. ద్వారం దగ్గరున్న తలుపువద్ద పూజ్యశ్రీ మాస్టరుగారు సిగరెట్ తాగుతూ నిల్చుని కనిపించారు!! గుండె ఝల్లుమన్నది. ఎంతో ఆశ్చర్యానందాలను కలిగించిన ఈ హఠాత్ సంఘటన నించి తేరుకుని మళ్ళీ చూసేసరికి వారు కనిపించలేదు. తెల్ల చొక్కా, గళ్ళలుంగీ వేసుకుని చాలా స్పష్టంగా కనిపించారు. చాలా సేపటివరకు ఆ అనుభూతిలోనే వుండిపోయాను. 'మమ్మల్నందరిని కూడా మీరే దగ్గరుండి తీసుకెళ్ళాలి' అని ప్రార్థించినందుకు ఇలా దర్శనమిచ్చారని అప్పుడనిపించింది.

ఆ యాత్రలో ఒకరోజు నేను మా బాబు, గురుస్థానానికి ప్రదక్షిణాలు చేస్తున్నాము. అప్పుడు గురుస్థానంలో పూజ చేస్తున్న పూజారిగారు మా బాబుని ఆపి ఏదో చెప్తున్నారు. వాడికి అర్థం కాలేదు. ఈలోపు నేను కూడా వెళ్లాను. అప్పుడు ఆయన మాకు ఒక పీచుతియ్యని కొబ్బరికాయ ఇచ్చి 'ఘర్ కో లేజావ్' అన్నారు. మాకు హిందీ రాదు కనుక ఏమంటున్నారో అర్థం కాలేదు. అప్పుడు ఆయన నా కొంగు పట్టమని, ఆ కొబ్బరికాయ నా కొంగులోవేసి, సైగల ద్వారా మా ఇంటి ద్వారబంధానికి కట్టమని చెప్పారు. నేను చాలా సంతోషంగా అది తీసుకుని వచ్చాను. సాయినాథుని కృపకి కళ్ళు చెమర్చాయి ఎందుకంటే మేము షిరిడీకి వచ్చేముందు మా చుట్టాలందరూ, ఇంటికి దిష్టి తగలకుండా వుండాలని బ్రహ్మజెముడు కొమ్మలు కట్టుకుంటూ నన్ను కూడా కట్టమన్నారు. మా ఇంటి గుమ్మానికి ఎదురుగా పూజ్యశ్రీ మాస్టరుగారి పటం ఉంటుంది. ఆయనుండగా ఇవన్నీ ఎందుకు అన్న ఉద్దేశంతో "అవసరమైతే ఆయన చెప్తారులే, అప్పుడు కట్టుకుంటాను" అన్నాను. ఇప్పుడు ఇలా జరిగేసరికి శిరిడి పుణ్యక్షేత్రంలో, బాబా గారి ఆశీస్సులతో, పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రసాదించారు అనిపించింది.

కొంతకాలానికి మా అత్తయ్య, మావయ్య కాలం చేశారు. మాకున్న స్థలం అందరం వాటాలు పంచుకున్నాము. మేము ఇల్లు కట్టుకోవాలనుకున్నాము. చాలినంత డబ్బు లేదు. అందుకని ఉన్నదానితోనే ఒక పూరిల్లు వేసుకుందాం అనుకున్నాము. కానీ బాబా, మాస్టరుగారి దయవల్ల, మాకు లోన్ దొరికి స్లాబ్ ఇల్లే కట్టుకున్నాము. ఆ యిల్లు కడుతున్నప్పుడు, గోడకి పూజ్యశ్రీ మాస్టరుగారి పటం పెట్టుకున్నాము. లోపలకి వెళ్ళినప్పుడల్లా నమస్కారం చేసుకునేదాన్ని. గృహప్రవేశం వారం రోజులుందనగా, మేస్త్రికి, పనివాళ్ళకి గొడవొచ్చి ప్రహరి గోడ పని ఆపేశారు. ఈ విషయంలో మేము కొంచెం ఆందోళన పడుతుంటే, నాకొక స్వప్నం వచ్చింది.ఒకాయనవచ్చిమాప్రహరీగోడ కడుతున్నారు. నేను 'ఇతనెవరా?' అని ఆశ్చర్యపోయి చూస్తుంటే, అతనికి ఫోన్ వచ్చింది. అతను వాళ్ళతో, "నేనిప్పుడు ఎవరింటికి పనికి రాలేను. ఇక్కడ భరద్వాజ మాస్టరుగారి ఇల్లు కడుతున్నాను. అది పూర్తయ్యే వరకు ఎక్కడకి రాను" అంటున్నాడు. తెల్లవారేసరికి, పాత పనివాళ్లంతా వచ్చి మిగిలిన పని పూర్తిచేశారు. నిజంగా పూజ్యశ్రీ మాస్టరుగారి ఆధ్వర్యంలో మా ఇల్లు పూర్తయ్యింది అనడానికి ఇదొక మచ్చుతునక మాత్రమే. కట్టడం మొదలుపెట్టిన దగ్గరనించి ఇల్లు పూర్తయ్యే వరకు, ప్రతి విషయంలోనూ పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతగానో కాపాడారు. 2013, ఫిబ్రవరి 13 న మా ఇల్లు గృహప్రవేశం జరిగింది.

ఇలా ఎన్నో అనుభవాలని ప్రసాదించి, అడుగడుకుకీ మమ్మల్ని ఆదుకుంటున్న, పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ పాదపద్మములకు కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలులు!

జై సాయి మాస్టర్!!

# పరసువేది

22వ పేజీ తరువాయి

మార్పు వస్తుందని నేను అనుకోలేదు" అన్నాడు. "మావాడికి ఢిల్లీలో జాబ్ వచ్చిందని మాస్టరుగారి దగ్గరకొచ్చి 'వెళ్ళమంటారా?' అడిగాడు. "సం॥నికి ఒకసారి గాని, రెండుసార్లుగాని వచ్చేటట్లయితే నువ్వు వెళ్ళొచ్చు" అన్నారు మాస్టరుగారు. "తప్పకుండా అట్లాగే చేస్తాను సార్" అని అన్నాడు వాడు. అన్నమాట ప్రకారం వాడు ప్రతి సం॥ము నర్సోబావాడి వెళ్ళి వస్తూనే వున్నాడు.

పెద్దాడికి వుద్యోగం రాలేదని నా భార్య మాస్టరుగారి దగ్గర చాలా బాధపడ్తుంటే "ఎందుకమ్మా వూరికే బాధపడ్తావు. వాడి గురించి నువ్వేమీ బాధపడనక్కర్లేదు. వాడి బాధ్యత నేను తీసుకుంటాను" అన్నారు. "చిన్నాడి విషయం మాత్రం నరసింహ సరస్వతిదే. వాడి బాధ్యత ఆయనకు ఒప్ప చెప్పాను. పెద్దాడి బాధ్యత మాత్రం నేను తీస్కున్నాను" అని స్పష్టంగా చెప్పారు. చిన్నాడొకసారి మాస్టరుగారిచ్చిన తాయత్తు పోగొట్టుకున్నాడు. వాడు వచ్చి మళ్ళీ అడిగితే మరలా యిస్తూ "నాన్నా! ఈసారి నీవు పోగొట్టుకుంటే నీకు ఇవ్వనురా" అన్నారు.

మాస్టరుగారు "పెద్దాడి బాధ్యత నాది" అన్నారు. గనుక వాడికి రాజస్థాన్ లో వుద్యోగం వచ్చినా అక్కడికి పంపించగల్గాము. వాడిక్కూడా మాస్టరుగారంటే ఎంతో యిష్టం, అభిమానం, గౌరవం. మాస్టరుగారు వారికప్పుడప్పుడు కొన్ని వస్తువులు ఇచ్చి నీ దగ్గరే అట్టే పెట్టుకోమన్నారు. ఒక పెద్ద లాకెట్లో అన్నింటిని వేయించి దాన్ని మెళ్ళో వేసుకున్నాడు. ఒకసారి గనులలో పన్జేసేటప్పుడు యాక్సిడెంట్ అయినా వీడికేమీ ఆపద వాటిల్లలేదు. అలాగే మొన్నా మధ్య జీప్ యాక్సిడెంట్ అయినా ఏమీ దెబ్బతగల్లేదు. సాయి మాస్టరుగారే వాడిని కాపాడుతున్నారు. అట్లా మాస్టరుగారు మా కుటుంబాన్ని కంటికి రెప్పలా రక్షిస్తున్నారు. ఆయన ఋణం ఎలా తీర్చుకోగలం ?

## ద్వారకామాయి అనుభవమండపము

26వ పేజీ తరువాయి

రోజు. ఉదయమే బాబా దర్శనం చేసుకొని బైటికి వచ్చాను. అక్కడ బాబాకి అభిషేకం చేసిన పాలు, నైవేద్యం పెట్టిన వెన్న, ఊదీ ,,,,ప్రసాదంగా ఇస్తున్నారు. నేను ఏ వరుసలో నిల్చుంటే ఆ ప్రసాదమే దొరుకుతుంది, మిగిలినవి దొరకవు. అందువల్ల ఏ వరుసలో నిల్చోవాలా అని ఆలోచిస్తుంటే, ఊది కౌంటర్ లో ఉన్న వ్యక్తి, నా వైపు చెయ్యి ఊపుతూ 'ఇలా రావయ్యా' అని పిలిచాడు. సరేనని వెళ్లాను. 'ఇక్కడ నిల్చుని అందరికి ఊది ఇస్తావా, నేనిప్పుడే వస్తాను' అన్నాడు. నాకు ఆ లైను ఎంత సేపు కొనసాగుతుందో, నేను ఊరికి వెళ్లే సమయం అవుతుందేమోనన్న ఉద్దేశంతో, నేను ఊరికెళ్ళిపోవాలి అని చెప్పాను, వెడుదువుగాని లేవయ్యా అని చెప్పి, అతను వెళ్ళిపోయాడు. నేను ఆ కౌంటర్ లో నిల్చుని ఊది పాకెట్స్ ఇచ్చే సేవ చేస్తున్నాను. ఒక పది నిముషాలకి అతను తిరిగి వచ్చి, నాకు ఒక ఆకులో వెన్న ప్రసాదం, ఒక సీసాలో అభిషేక తీర్థం, 30 దాకా ఊది పొట్లాలు ప్రసాదంగా యిచ్చి, 'ఇప్పుడు వెళ్ళవయ్యా' అన్నాడు. నేను చాలా ఆశ్చర్యపోయాను, వెళ్ళేముందర ఇంత దండిగా బాబా ప్రసాదం ఇచ్చి పంపించారంటే, మా అమ్మకి సద్గతి ప్రసాదించి ఉంటారని చాలా సంతోషించాను.

ఈవిధంగా, సామాన్యుడనైన నాకు ఎన్నో అనుభవాలని ప్రసాదించి, నన్ను దరిచేర్చుకున్న బాబా దయ, ఎల్లప్పుడూ నాపై వుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను

జై సాయి మాస్టర్!

# మరికొందరు భక్తులు

24వ పేజీ తరువాయి

ఒకసారి బాబా తమ మహాసమాధి గురించి ముందుగా సూచించారు. అపుడు నిర్మాణంలోవున్న బూటీవాడాను చూపుతూ, 'లాయిల్లాహ్ యిల్లిల్లిహ్; క్యాబడా దర్బార్ హై! మున్షీజీ తో అంథా హై; సర్దార్జీ ఛుటాయీ; అల్లాహ్ మాలిక్ హై! అల్లా అచ్చాకరేగా!' అన్నారు. ఆయన చెప్పినట్లే ఆ బూటీ వాడా వారి సమాధి మందిరమైంది. ముందుముందు వారి సమాధి మందిరం దర్శించనున్న ధనికులు ('సర్దాజీ'), ప్రభుత్వాధికారులు ('మున్షీజీ') లతో గూడిన లెక్కకుమీరిన భక్తజనులే ఆయన చెప్పిన దర్బారు.

**- సశేషం**

## పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o.SRI MANGA BHARADWAJA TRUST**

**Regd.Office:** Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad-68.

Phone: +91 - 74160 41550

**Branch Office** : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh.

Phone:08592 233271

Send DD in favour of **"Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad or Ongole.**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర (Bound) | 450-00 |
| శ్రీ సాయి లీలామృతం | 150-00 |
| శ్రీ గురు చరిత్ర | 150-00 |
| శ్రీ సాయి సన్నిధి | 120-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 125-00 |
| శ్రీ సాయినాథ ప్రభోధామృతము | 80-00 |
| సాయినాథ పూజ | 40-00 |
| సాయినాథ స్థవనమంజరి | 10-00 |
| శిరిడి ఆరతులు | 15-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 10-00 |
| సత్సంగము - భజన | 5-00 |
| శిరిడి క్షేత్ర సందర్శనము | 40-00 |
| విజ్ఞాన వీచికలు | 99-00 |
| పరిప్రశ్న | 99-00 |
| మతమెందుకు? | 20-00 |
| ఏది నిజం? | 25-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 99-00 |
| బుద్ధధ్యాన హృదయం | 49-00 |
| దత్తావతార మహత్మ్యం | 75-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 125-00 |
| పురుషసూక్త రహస్యం | 40-00 |
| సాయిసూక్తి - ఆచార్యవాణి | 10-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 49-00 |
| అవధూత శ్రీ చీరాలస్వామి | 49-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 70-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 49-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 80-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 49-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 49-00 |
| మనము - మన సంస్కృతి | 70-00 |

### ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 120-00 |
| అవధూత చివటం అమ్మ | 70-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-1 | 125-00 |
| మరో నందదీపం | 80-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 175-00 |
| బాలల శ్రీ సాయి లీలామృతము | 25-00 |
| మహాపురుషుడు | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-2 | 125-00 |
| బాలల శ్రీ సాయి సన్నిధి | 50-00 |
| బాలల శ్రీ గురు చరిత్ర | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ నిత్యసత్య వ్రతము | 15-00 |
| మాష్టారు అమృత వాక్కులు | 100-00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba the Master | 175-00 |
| Sree Guru Charitra | 99-00 |
| Supreme Master (Swami Samartha) | 99-00 |
| Sai Baba of Shiridi and His Teachings | 99-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 99-00 |
| Children's Sai Baba the Master | 60-00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 150-00 |
| Sai Leelamrutham (Kannada) | 150-00 |
| Sai Baba Jeevitha Charitham (Malayalam) | 220-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 175-00 |
| Sri Guru Charitra (Hindi) | 99-00 |
| Swami Samartha (Kannada) | 50-00 |
| Sri Guru Charitra (Kannada) | 99-00 |
| Shiridi Aarathi (Tamil) | 15-00 |
| Stavana Manjari (Tamil) | 10-00 |
| Tibet Yogi Milarepa Jeevitha Charitra (Kannada) | 55-00 |
| Sri Sainath Prabodhamruthamu (Kannada) | 65-00 |
| Sai Sannidhi (Kannada) | 120-00 |
| Sri Guru Charitra (Malayalam) | 150-00 |
| Sri Guru Charitra (Oriya) | 150-00 |

## ఈ నెల పండుగలు

**ఫిబ్రవరి 06 - శ్రీ సాయి మాస్టర్ బ్రహ్మానుభూతి పర్వదినము**
**(తిథి ప్రకారము - మాఘ బహుళ పాడ్యమి)**
**ఫిబ్రవరి 06 - శ్రీ నృసింహ సరస్వతి స్వామి అంతర్ధానమైన రోజు**
**(తిథి - మాఘ బహుళ పాడ్యమి)**
**ఫిబ్రవరి 09 - శ్రీ సాయి మాస్టర్ బ్రహ్మానుభూతి పర్వదినము**
**ఫిబ్రవరి 09 - శ్రీ సేలం మాయీ అమ్మ ఆరాధన**
**ఫిబ్రవరి 13 - శ్రీ గజానన మహారాజు ప్రకటమైన రోజు (మాఘ బహుళ సప్తమి)**
**ఫిబ్రవరి 15 - పూజ్యశ్రీ మాస్టరుగారు మరియు పూజ్యశ్రీ అమ్మగార్ల కల్యాణ మహోత్సవము (తిథి ప్రకారము మాఘ బహుళ నవమి)**
**ఫిబ్రవరి 18 - శ్రీ పాకలపాటి గురువుగారి ఆరాధన**
**ఫిబ్రవరి 18 - శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి**
**ఫిబ్రవరి 22 - శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి**
**(తిథి ప్రకారము - ఫాల్గుణ శుద్ధ విదియ)**
**ఫిబ్రవరి 26 - శ్రీ రాఘవేంద్ర స్వామి జయంతి (ఫాల్గుణ శుద్ధ సప్తమి)**

---

"ఆధ్యాత్మిక పరిపూర్ణతయందు అభిలాష గలవారికి ఏ మార్గాన్నవలంభించాలా, ఏ మహాత్ముడు చెప్పింది, లేక ఏ మతం చెప్పింది నమ్మాలా అని సందేహాలు కలుగుతుంటాయి. ఏ మార్గమైనా సరిగా ఆచరిస్తే ఒకే స్థితికి దారితీస్తుంది అన్న విషయం వివిధ మార్గాలలో వివిధ మతాలలో కనిపించే మాహాత్ముల చరిత్రలలో నిరూపితమైంది. ఐనా కొందరికి ఈ సందేహం తీరదు. దీనికితోడు అన్ని రంగాలలోనూ అవినీతి ప్రబలినట్లే ఈ రంగంలో కూడా సామర్ధ్యంలేని వారనేకమంది ప్రజలను మోసగించి స్వప్రయోజనాలను సాధించుకోవడం చాలా విరివిగా జరుగుతోంది. ఇది చాలదన్నట్టు ఒక మహాత్ముని భక్తులు ఇతర మహాత్ములంతా దొంగలూ, వంచకులూ అని దుష్ప్రచారం చెయ్యడం చాలా విరివిగా జరుగుతోంది. ఇవన్నీ కలిసి సత్యాన్వేషకుడికి ఎన్నో చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. ఈ పరిస్థితులలో కబీరు, రమణ మహర్షి, సాయిబాబా, రామకృష్ణ పరమహంస వంటి అనేక మహాత్ములు చెప్పిన ఒక్క సత్యం ఆశాజ్యోతిగా మెరుస్తుంది. అన్వేషకుడి ఆర్తి తీవ్రమైనపుడు అతనికి తగిన మార్గం చూపే మహాత్ముడు వారికి లభిస్తారు అని చెప్పారు. మహాత్ముల చరిత్రలలో ఇటువంటి నిదర్శనాలెన్నైనా చూడవచ్చు. నా అనుభవంలో మహాత్ముల చరిత్ర పఠన, వారి ఉపదేశాలను గూర్చిన చింతన, వారిని ధ్యానం చెయ్యడం చాలా ప్రయోజనకారిగా కనిపిస్తున్నాయి."

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.



శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి

(18-02-2023)

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.